teenmaardesk@gmail.com

RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...


తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 180 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | శనివారం | 26 అక్టోబర్ 2024 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## వాయుకాలుష్య ప్రమాదాలకు సంసిద్ధతను పెంచాలి

### రాష్ట్రా ప్రభుత్వాలను కోరిన కేంద్రం



న్యూ ఢిల్లీ, అక్టోబర్ 25 (తీన్మార్ న్యూస్): వాయు కాలుష్యాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వాలు సంసిద్ధతను పెంచుకోవాలని కేంద్రం కోరింది. ఆరోగ్య సేవల డైరెక్టర్ జనరల్ డాక్టర్ అతుల్ గోయెల్ వాయు కాలుష్య సంసిద్ధతకు సంబంధించి రాష్ట్రాలు మరియు కేంద్ర పాలిత ప్రాంతాల ఆరోగ్య శాఖలకు లేఖ రాశారు. తీవ్రమైన ఆరోగ్య పరిస్థితులకు వాయు కాలుష్యం గణనీయమైన దోహదపడుతుందని మరియు శ్వాసకోశ, హృదయ మరియు సెరెబ్రోవాస్కులర్ వ్యవస్థలను ప్రభావితం చేసే

మిగతా 2 లో



## బెటాలియన్ పోలీస్ కానిస్టేబుళ్ల కుటుంబాల

# పోరాటం సఫలం

### దిగొచ్చిన ప్రభుత్వం.. గతంలోని జీవో నిలిపివేత

### ఈ మేరకు స్పెషల్ అదనపు డీజీపీ ఉత్తర్వులు





**బెటాలియన్ పోలీస్ కానిస్టేబుళ్ల కుటుంబాల పోరాటం ఫలించింది. ఎట్టకేలకు దిగొచ్చిన ప్రభుత్వంలో గతంలో ఇచ్చిన జీవోను తాత్కాలికంగా నిలిపివేసింది. ఈ మేరకు స్పెషల్ అదనపు డీజీపీ శుక్రవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో సెలవుల విషయంలో తెలంగాణ బెటాలియన్ కానిస్టేబుళ్లకు ఊరట లభించింది.**

హైదరాబాద్, అక్టోబర్ 25 (తీన్మార్ న్యూస్): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు బెటాలియన్ కానిస్టేబుళ్లు 15 రోజులకు ఒకసారి సెలవుపై వెళ్లే అవకాశం ఉండేది. కానీ ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం ఆ నిబంధనలను మార్చి కొత్త లీవ్ మాన్యువల్‌ను అమలు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు కొత్త జీవోను విడుదల చేసింది. దీని ప్రకారం ఇప్పటివరకు 15 రోజులకు ఒకసారి ఇంటికి వెళ్లిన కానిస్టేబుళ్లు ఇకపై 26 రోజులకు ఒకసారి ఇంటికి వెళ్లాల్సి వస్తుంది. ఈ మ్యాన్యువల్‌పై బెటాలియన్ కానిస్టేబుళ్ల కుటుంబసభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే పలు బెటాలియన్ల ముందు ధర్నా చేయగా శుక్రవారం సెక్రటేరియట్ ముట్టడికి కూడా యత్నించారు. దీంతో రేవంత్ సర్కార్ దిగొచ్చి ఆ జీవోను తాత్కాలికంగా నిలిపివేసింది.



# 31 వసతి గృహాల్లో అధికారులు రాత్రి బస

### విద్యార్థులతో కలసి రాత్రి భోజనం, ఉదయం అల్పాహారం

### వసతి గృహాల్లో అవసరమైన మరమ్మత్తులు వివరాల సేకరణ



ములుగు జిల్లా, అక్టోబర్ 25 (తీన్మార్ న్యూస్): జిల్లాలోని 31 వసతి గృహాలను గురువారం అధికారులు తనిఖీ చేసి, రాత్రి బస చేశారని జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎఎస్. శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం మండల ప్రత్యేక అధికారులు, ఎంపి డి ఓ లు, తహసీల్దార్లు, ఎంపి ఓలు, ఇతర అధికారులు మొత్తం 31 మంది అధికారులను వసతి గృహాలను తనిఖీ చేసి రాత్రి బస చేసి, విద్యార్థులతో కలసి రాత్రి భోజనం, ఉదయం

మిగతా 2 లో

## మంత్రి కొండా సురేఖకు సివిల్ కోర్టు స్ట్రాంగ్ వార్నింగ్

### రిపీట్ కాకుండా చూసుకోవాలని హెచ్చరికలు



02

## రూ. 10 నాణేలు చట్టబద్ధమైనవే

### సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్



హైదరాబాద్, అక్టోబర్ 25 (తీన్మార్ న్యూస్): గత కొంత కాలంగా 10 రూపాయల నాణేలు చెల్లడం లేదంటూ కొందరు వ్యాపారులు తిరస్కరిస్తున్న విషయం తెలిసిందే. దీంతో ప్రజలు కూడా ఎవరైనా రూ. 10 నాణేలు ఇస్తే తీసుకోవడం లేదు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా

మిగతా 2 లో



## హైదరాబాద్ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

### బిల్డర్లు భాగస్వామ్యం కావాలి : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 25 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని, అభివృద్ధిలో రియల్టర్లు, బిల్డర్లు భాగస్వామ్యం కావాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ హైటెక్స్‌లో 14 వ ప్రాపర్టీ షో

మిగతా 2 లో

## ధర్నాలతో దద్దరిల్లుతోన్న తెలంగాణ

### మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు విమర్శలు




హైదరాబాద్, అక్టోబర్ 25 (తీన్మార్ న్యూస్): దద్దమ్మ పాలనలో ధర్నాలతో తెలంగాణ రాష్ట్రం దద్దరిల్లుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు విమర్శించారు. ఈమేరకు ఎక్స్(ట్విట్టర్)లో కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. దిక్కుమాలిన పాలనలో ప్రజల జీవితాలు దిక్కుమొక్కు లేకుండా పోయాయని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. అలంపూర్ నుంచి మొదలు పెడితే ఆదిలాబాద్ వరకు, గ్రామ సచివాలయం నుంచి మొదలు రాష్ట్ర సచివాలయం వరకు, రైతు నుంచి మొదలు రైస్ మిల్లర్ల వరకు, కార్మికుని నుంచి మొదలు కాంట్రాక్టర్ల వరకు, టీచర్ల నుంచి

మిగతా 2 లో



## కేసీ వేణుగోపాల్‌తో డిప్యూటీ సీఎం భట్టి సమావేశం

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 25 (తీన్మార్ న్యూస్): ఢిల్లీ పర్యటనలో భాగంగా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శుక్రవారం సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన ప్రక్రియపై వివరణ ఇచ్చారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి వచ్చిన సందర్భంగా గతేడాది రాహుల్‌గాంధీ కులగణనపై

మిగతా 2 లో

## గాంధీ ఐడియాలజీ కేంద్రంగా బాపూ ఘాట్ అభివృద్ధి

### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి



హైదరాబాద్, అక్టోబర్ 25 (తీన్మార్ న్యూస్): ప్రపంచమంతా హైదరాబాద్ వైపు చూసేలా అంతర్జాతీయ స్థాయిలో గాంధీ ఐడియాలజీ కేంద్రంగా బాపూ ఘాట్ ను అభివృద్ధి చేయ-బోతున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఈసా, మూసా నదులు కలిసే చోట బాపూ ఘాట్ ఉందని, అక్కడ గుజరాత్ లోని సర్దార్ వల్లబాయ్ పటేల్ విగ్రహం మాదిరిగా బాపూ ఘాట్ లో గాంధీజీ విగ్రాహాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. శుక్రవారం హైదరాబాద్ వేదికగా ఏబీపీ నెట్ వర్క్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ది సదరన్ రైజింగ్ సమ్మిట్'ను సీఎం రేవంత్‌రెడ్డి

మిగతా 2 లో

## 19 వీడీఏలను ఏర్పాటు చేస్తూ పురపాలక శాఖ ఉత్తర్వులు

తెలంగాణ బ్యూరో, అక్టోబర్ 25 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో పట్టణ ప్రాంతాలు, సమీప గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, ఆదాయ వనరుల సమీకరణే లక్ష్యంగా హెచ్ఎండీఏ తరహాలో 19 అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీ (వీడీఏ) లను ఏర్పాటు చేస్తూ

మిగతా 2 లో

## పేదలకు మంచి చేసే విషయంలో రాజకీయాలొద్దు

### సియోల్ పరిస్థితి హైదరాబాద్ తరహానే ఉండేది

### ఇప్పుడు స్మార్ట్ సిటీ, స్పోర్ట్స్ సిటీ నిర్మించుకున్నారు

### ఒకటి రెండు రోజుల్లో కేబినెట్ కు సమగ్ర నివేదిక ఇస్తం

### విమానాశ్రయంలో మంత్రులు పొంగులేటి, పొన్నం



హైదరాబాద్, అక్టోబర్ 25 (తీన్మార్ న్యూస్): మూసీ పునరుజ్జీవం చేసి తీరుతామని, పేదలకు మంచి చేసే విషయంలో ఎలాంటి రాజకీయాలు చేయొద్దని ప్రతిపక్షాలకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచించారు. సియోల్ పర్యటనకు వెళ్లిన మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు

మిగతా 2 లో



## ఎడ్యుకేషన్ అకడమిక్ ఇయర్‌లో రానున్న మార్పులు

### కసరత్తు చేస్తున్న హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్

హైదరాబాద్, అక్టోబర్ 25 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో ఎడ్యుకేషన్ అకడమిక్ ఇయర్ లో మార్పులు రాబోతున్నాయి. దీనికి సంబంధించిన కసరత్తును తెలంగాణ ఉన్నత విద్యా మండలి ప్రారంభించింది. ప్రస్తుతం డిగ్రీ, పీజీ, పలు ప్రొఫెషనల్ కోర్సుల అడ్మిషన్లు నవంబర్, డిసెంబర్ వరకూ కొనసాగుతున్నాయి. దీనికి చెక్ పెట్టి మరింత ముందుకు తీసుకుపోవాలని అధికారులు భావిస్తున్నారు. రాష్ట్రంలో డిగ్రీ అడ్మిషన్ల కోసం దోస్త్ ఆన్‌లైన్ ప్రక్రియ కొనసాగుతోంది. పీజీ కోర్సుల్లో అడ్మిషన్లకు సీపీ గెట్, ఇంజినీరింగ్ ఫార్మసీ అడ్మిషన్ల కోసం ఈఏపీ సెట్, ఎంబీఏ, ఎంసీఏ కోసం ఐసెట్, బీఈడీ కోసం ఎడ్ సెట్ ఇలా ప్రతి కోర్సులో అడ్మిషన్ల కోసం హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ ప్రవేశ పరీక్షలు

మిగతా 2 లో

## రాష్ట్రంలో పత్తి రైతులకు మంత్రి, తుమ్మల గుడ్ న్యూస్

### పత్తి అమ్మకం జాప్యానికి వాట్సాప్ సేవలు ప్రారంభం



తెలంగాణ బ్యూరో, అక్టోబర్ 25 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో పత్తి రైతులకు వ్యవసాయ శాఖ మంత్రి, తుమ్మల నాగేశ్వరరావు గుడ్ న్యూస్ చెప్పారు. పత్తిని అమ్ముకోవడంలో ఎలాంటి జాప్యం జరుగొద్దని వాట్సాప్ సేవలు ప్రారంభించామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. శుక్రవారం మీడియా ప్రకటన విడుదల చేశారు. పత్తి రైతుల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం వాట్సాప్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చిందని తెలిపారు. వాట్సప్ నెంబర్ 8897281111 ద్వారా పత్తి

మిగతా 2 లో

# సారు మీరు ఎక్కడ..?

## మా గేదకు పానం బాలేదు
## గేదతో గేటు ముందే
## గంటల తరబడి పడిగాపులు
## సమయపాలన లేక ఇబ్బందులు
## ఎదుర్కొంటున్న పశుపోషకులు



వనపర్తి జిల్లా, అక్టోబర్ 25 (తీన్మార్ న్యూస్): పశువులు వ్యాధుల బారిన పడినప్పుడు పశువైద్యశాలల్లో పశువైద్యాధికారి, సిబ్బంది అందుబాటులో లేక పశుపోషకులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వనపర్తి జిల్లా రేవల్లి మండల కేంద్రంలోని పశువైద్య కేంద్రాల్లో పశువులకు వైద్య సేవలు అందడం లేదు. పశువైద్యాధికారి, సిబ్బంది నిర్లక్ష్యంతో ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా సేవలను అందించలేకపోతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మండల కేంద్రంలో పశువుల ఆసుపత్రిలో డాక్టర్ రాకపోవడంతో ఓ రైతు తన గేదతో గేటు ముందే గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చిందని స్థానికులు తెలిపారు. ఎంత వేచి చూసిన డాక్టర్ రాకపోయేసరికి సారూ.. మీరు ఎక్కడ మా గేదకు పానం బాగాలేదు చూపించాలి అంటూ రైతు డాక్టర్ కోసం ఎదురు చూశాడని స్థానికులు తెలిపారు. చివరికి చేసేదేమిలేక.. తన భార్యతో కలిసి గేదెను తోలుకొని ఇంటికి వెళ్ళాడు. దీంతో ఆ రైతు ఫోటో స్థానిక గ్రూపులలో వైరల్ మారింది.

## గాంధీ ఐడియాలజీ కేంద్రంగా బాపూ ఘాట్ అభివృద్ధి

మొదటి పేజీ తరువాయి

ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడాతూ మూసీ పునరుజ్జీవాన్ని చేసి గాంధీ వారసులుగా మేం బాపూ ఘాట్ ను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తామంటే దీన్ని బీఆరెస్, బీజేపీ ఎందుకు అడ్డుకోవాలని చూస్తున్నాయని ప్రశ్నించారు. మీరు గుజరాత్ లో సబర్మతి రివర్ ఫ్రంట్ నిర్మించుకోవచ్చు కానీ మేము మూసీ పునరుజ్జీవం చేస్తామంటే మీ బీజేపీ నేతలు అడ్డుకుంటున్నారెందుకు అని ప్రశ్నించారు. ఎందుకంటే మేము గుజరాత్ కు పోటీ ఇవ్వబోతున్నామని అందువల్లే తెలంగాణను, హైదరాబాద్ ను ఫినిష్ చేయాలని బీజేపీ నేతలు మా ప్రభుత్వ నిర్ణయాన్ని అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఫ్యూచర్ సిటీ, రీజనల్ రింగ్ రోడ్డు, రేడియల్ రాడార్, ఇరిగేషన్ ప్రాజెక్టులతో తెలంగాణ పురోగతి సాధించి గుజరాత్ కు పోటీ ఇస్తుందనే విషయం తెలిసే మా ప్రయత్నాలను ఆపేందుకు బీజేపీ, బీఆర్ఎస్ కలిసి ప్రయత్నం చేస్తున్నాయన్నారు. బీఆర్ఎస్ వ్యతిరేకించిన మరుసటి రోజే కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుబడతారని ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి ఫ్యూచర్ సిటీ నిర్మిస్తే సమస్య ఏంటని నిలదీశారు.

**సౌత్ స్టేట్స్ పై చిన్నచూపు**

దక్షిణాది రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. సౌత్ స్టేట్స్ కు ప్రధాని మోడీ అందించిన సహకారం చాలా తక్కువ అన్నారు. దక్షిణాది రాష్ట్రాలకు కేంద్రం పెద్దగా నిధులు ఇవ్వకపోయినా ఇక్కడి ఓట్లు కావాలని ఎలా అడుగుతారని ప్రశ్నించారు. నార్త్ స్టేట్స్ తో పోలిస్తే సౌత్ స్టేట్స్ ఎక్కువ పన్నులు చెల్లిస్తున్నా వాటిలో తిరిగి పొందేది మాత్రం చాలా తక్కువ వాటా ఉందన్నారు. కేంద్రానికి మేం ఒక్క రూపాయి పంపిస్తే తిరిగి వెనక్కి వస్తున్నవి కేవలం రూ.40 పైసలు మాత్రమేనన్నారు. అదే యూపీ నుంచి పన్నుల ద్వారా కేంద్రానికి రూపాయి వెళ్తే రూ.7, బిహార్ కు రూ.6 వెనక్కి వస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలను దక్షిణాది రాష్ట్రాలు ఆహ్వానిస్తున్నా నిధుల విషయంలో మాత్రం వివక్ష జరుగుతూనే ఉందని విమర్శించారు. ప్రధాని మోడీ ఉత్తర భారత దేశానికి చెందిన వ్యక్తి కావడమే ఈ ప్రాంతాన్ని పట్టించుకోకపోవడానికి కారణం అని పేర్కొన్నారు.

## కేసీ వేణుగోపాల్‌తో డిప్యూటీ సీఎం భట్టి సమావేశం

మొదటి పేజీ తరువాయి

స్పష్టమైన హామీ ఇచ్చారని, దేశవ్యాప్తంగా చేపట్టే ప్రక్రియలో భాగంగా తెలంగాణ నుంచే మొదట ప్రారంభిస్తామన్న మాట మేరకు ఈ విధాన నిర్ణయం తీసుకున్నట్లు డిప్యూటీ సీఎం వివరించారు. గత కొన్ని రోజులుగా కులగణన చేపట్టడానికి అనుసరించాల్సిన విధానంపై స్టేట్ బీసీ కమిషన్ కసరత్తు చేస్తున్నదని, ప్రక్రియ సజావుగా, సంతృప్తికరంగా, ఫలితాలు అందించే విధంగా ఉండేందుకు రాష్ట్ర ప్లానింగ్ డిపార్టుమెంటును నోడల్ ఏజెన్సీగా నియమించి నిర్వహిస్తున్నట్లు కేసీ వేణుగోపాల్‌కు వివరించారు. ఈ ప్రక్రియ ద్వారా రానున్న ఫలితాలు, దానికి అనుగుణంగా ప్రభుత్వం అమలుచేసే సంక్షేమ పథకాల్లో లబ్ధిదారుల గుర్తింపు సులభతరం కావడం, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ ఫార్ములాను ఫైనల్ చేయడానికి దోహదపడడం ఇలాంటి అనేక అంశాలను వివరించారు. కులగణన కోసం రూపొందించిన ప్రశ్నావళి, ప్రొఫార్మాను అందజేశారు. ఈ నెల 28 నుంచి రాష్ట్రవ్యాప్తంగా కులగణన ఎనిమిది వారాల పాటు (60 రోజులు) జరగనున్నదని, డిసెంబరు 9వ తేదీ నాటికి ప్రభుత్వానికి నివేదిక అందనున్నట్లు కేసీ వేణుగోపాల్‌కు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వివరించారు. జార[illegible]ండ్ అసెంబ్లీ ఎన్నికలకు ఏఐసీసీ సీనియర్ అబ్జర్వర్‌గా పార్టీ హైకమాండ్ నియమించినందున గత వారం జరిపిన పర్యటన వివరాలను కూడా వేణుగోపాల్‌తో పంచుకున్నారు. అక్కడి పరిస్థితులను వివరించి పార్టీపరంగా తీసుకోవాల్సిన చర్యలు, సమన్వయం కోసం రూపొందించాల్సిన మెకానిజం తదితరాలపై కూడా చర్చించినట్లు తెలిసింది. ఇదే విషయమై అజయ్ మాకెన్‌తో కూడా విడిగా భేటీ అయిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అభిప్రాయాలను పంచుకున్నారు. సాయంత్రానికి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణవ-ఎయ్యారు. త్వరలో కొన్ని రోజుల పాటు జారండ్ ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు.

**సెంట్రల్ ఫైనాన్స్ సెక్రెటరీతో భేటీ**

గత ప్రభుత్వం చేసిన అప్పులు ప్రస్తుతం భారంగా మారడంతో రిలీఫ్ కోసం గత కొంతకాలంగా జరుగుతున్న ప్రయత్నాల్లో భాగంగా స్టేట్ ఫైనాన్స్ సెక్రెటరీ ఢిల్లీకి వెళ్ళి సెంట్రల్ ఫైనాన్స్ సెక్రెటరీ, పలువురు అధికారులతో సమావేశమయ్యారు. పాత ప్రభుత్వం చేసిన అప్పుల్లో 'అసలు', వడ్డీ చెల్లించాల్సి ఉన్నందున అంచనాలకు మించి భారంగా మారడంతో రుణాలను రీ షెడ్యూలు చేయడంతో పాటు వడ్డీ శాతాన్ని తగ్గించడానికి ఉన్న వెసులుబాటుపైనా చర్చించారు. గత ప్రభుత్వంలో రుణాలు ఇచ్చేటప్పుడు కుదిరిన ఒప్పందంలో రీపేమెంట్ కోసం నిర్దేశించుకున్న గడువును పొడిగించేలా పవన్ ఫైనాన్స్ కార్పొరేషన్, రూరల్ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ యాజమాన్యాలతో సంప్రదింపులు జరపాల్సిందిగా కోరినట్లు తెలిసింది. గతంలో ఢిల్లీ పర్యటన సందర్భంగా ప్రధానిని కలిసినప్పుడు పాత అప్పుల రీషెడ్యూలుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. ఆ కసరత్తులో భాగంగానే స్టేట్, సెంట్రల్ ఫైనాన్స్ డిపార్టుమెంటు అధికారుల మధ్య సమావేశాలు జరుగుతున్నాయి. సెంట్రల్ ఫైనాన్స్ సెక్రెటరీ సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది.

## ఎడ్యుకేషన్ అకడమిక్ ఇయర్‌లో రానున్న మార్పులు

మొదటి పేజీ తరువాయి

నిర్వహిస్తోంది. ఈ టెస్టులన్నీ మే, జూన్ నెలల్లో ఉంటున్నాయి. అయినా అడ్మిషన్ల ప్రక్రియ మాత్రం నవంబర్ వరకు సాగుతోంది. దీని ప్రభావం అకడమిక్ ఇయర్ పై పడుతోంది. ఇటీవలే ఉన్నత విద్యా మండలి చైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి దీనిపై వర్సిటీ నుంచి సమాచారం సేకరించారు. వర్సిటీల అకడమిక్ క్యాలెండర్లనూ పరిశీలిస్తున్నారు. త్వరలోనే వీసీలతో సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకుంటారు. మే నెలలోనే ప్రవేశపరీక్షలు నిర్వహించి జూన్, జులై, ఆగస్టు వరకూ అన్ని కోర్సుల్లో అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి చేయాలని కౌన్సిల్ అధికారులు భావిస్తున్నారు. దీనికి అనుగుణంగా డిగ్రీ ఫైనల్ సెమిస్టర్ పరీక్షలనూ ముందుగా నిర్వహించి, ఫలితాలు త్వరగా ప్రకటించేందుకు చర్యలు తీసుకోవాలని యోచిస్తున్నారు. అయితే, ఇంజినీరింగ్ కాలేజీలకు పర్మిషన్ ను ఏఐసీటీఈ ఆలస్యంగా ఇస్తుండడం కూడా కౌన్సెలింగ్ లేట్ అవుతోంది. మరోపక్క ఫార్మసీ కాలేజీలకు, లా కాలేజీలకు అనుమతులు ఆలస్యంగా వస్తుండటమూ దీనికి మరో కారణం. రాష్ట్రాల్లో జరిగే వివిధ కోర్సులకు జరిగే కౌన్సెలింగ్ లతో సంబంధం లేకుండా జేఈఈ, నీట్ అడ్మిషన్ల ప్రక్రియ నడుస్తోంది. దీని ద్వారా కూడా ఈఏపీ సెట్ కౌన్సెలింగ్ ఆలస్యమవుతోంది. రాష్ట్రంలో ఇంకా బీ ఫార్మసీ, పీజీతో పాటు పలు కోర్సుల అడ్మిషన్ల ప్రక్రియ నడుస్తుండడం గమనార్హం.

## మంత్రి కొండా సురేఖకు సివిల్ కోర్టు స్ట్రాంగ్ వార్నింగ్



హైదరాబాద్, అక్టోబర్ 25 (తీన్మార్ న్యూస్): సినీ నటులు అక్కినేని నాగచైతన్య, సమంత విడాకుల వ్యవహారంలో మంత్రి కొండా సురేఖ ఈ నెల 2వ తేదీన చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ నేత కేటీఆర్ దాఖలు చేసిన పరువు నష్టం దావాపై సిటీ సివిల్ కోర్టు శుక్రవారం విచారణ జరిపి మంత్రికి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చింది. బాధ్యతాయుతమైన మంత్రి పదవిలో ఉండి అసభ్యకరమైన, అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేశారంటూ మందలించింది. భవిష్యత్తులో మరోసారి ఇలాంటి వ్యాఖ్యలకు దూరంగా ఉండాలని, రిపీట్ కాకుండా చూసుకోవాలని హెచ్చరించింది. మహిళా మంత్రిగా ఉండి కూడా అభ్యంతరకరమైన తీరులో ఇలాంటి వ్యాఖ్యలు చేయడంపై విస్మయం వ్యక్తం చేసింది. కేటీఆర్ స్వయంగా పరువునష్టం దావా వేసినందువల్ల ఆయన పరువు ప్రతిష్టలకు భంగం కలగకుండా జాగ్రత్తగా ఉండాలని వార్నింగ్ ఇస్తూనే అడ్డగోలుగా, ఆధారాలు లేకుండా వ్యక్తిగతమైన అంశాల జోలికి వెళ్ళవద్దని సూచించింది. అత్యంత జుగుప్సాకరంగా ఉన్న ఆమె వ్యాఖ్యల వీడియోలను సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల నుంచి, వెబ్‌సైట్‌ల నుంచి, ప్రధాన మీడియా నుంచి తొలగించాలని ఆదేశించింది. యూ ట్యూబ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, గూగుల్ తదితర సోషల్ మీడియా యాజమాన్యాలకు కూడా ఆ వీడియోలను తొలగించాలని సిటీ సివిల్ కోర్టు ఆదేశించింది. ఇప్పటివరకు కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలను ప్రసారం చేసిన మీడియా సంస్థలు సైతం వీడియోలను, కథనాలను తొలగించాలని ఆదేశించింది. మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు సమాజంలో చెడు ప్రభావాన్ని చూపుతాయని, ఆమె చేసిన కామెంట్లకు సంబంధించిన అన్ని కథనాలను, వీడియోలను పబ్లిక్ డొమెయిన్‌లో ఉండకూడదని స్పష్టం చేసింది. సంబంధిత మీడియా, సోషల్ మీడియా సంస్థల యాజమాన్యాలకు ఆదేశాలు ఇస్తున్నట్లు గుర్తుచేసింది. మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలతో తనకు వ్యక్తిగతంగా, తాను ప్రాతినిధ్యం ఉన్న పార్టీకి చెడ్డపేరు వచ్చినందున, పరువు ప్రతిష్టలకు భంగం కలిగినందున రూ. 100 కోట్లతో ఆమెపై సివిల్ డిఫమేషన్ కేసును నాంపల్లి కోర్టులో కేటీఆర్ దాఖలు చేయగా దానిపై విచారణ సందర్భంగా జడ్జి పై ఆదేశాలు ఇచ్చారు. పరువునష్టం కేసులో మంత్రి స్థాయిలో ఉన్నవారిపై కోర్టు ఇంతటి తీవ్ర స్థాయిలో సీరియస్ కామెంట్లు చేయడం ఇదే ఫస్ట్ టైమ్ అని బీఆర్ఎస్ శ్రేణులు వ్యాఖ్యానించాయి. కేటీఆర్‌పై భవిష్యత్తులో ఎలాంటి వ్యాఖ్యలు చేయవద్దని మంత్రి సురేఖకు కోర్టు స్పష్టం చేయడంపైనా సంతోషం వ్యక్తం చేశాయి. మరోవైపు అక్కినేని నాగార్జున దాఖలు చేసిన డిఫమేషన్ కేసు ఇదే కోర్టులో విచారణలో ఉన్నది. క్రిమినల్ చర్యలు తీసుకోవాల్సిందిగా ఆ పిటిషన్‌లో నాగార్జున కోరారు. కోర్టు సమక్షంలో స్టేట్‌మెంట్ కూడా ఇచ్చారు. ఈ పిటిషన్ ఇంకా విచారణలో ఉన్నది. తదుపరి విచారణ నవంబరు 11న జరిగేలా నాంపల్లి కోర్టు వాయిదా వేసింది.

# 19 వీడీఏలను ఏర్పాటు చేస్తూ పురపాలకశాఖ ఉత్తర్వులు

మొదటి పేజీ తరువాయి

పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దానకిషోర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయా జిల్లా కేంద్రాలతో పాటు సమీపంలోని గ్రామాల్లో రోడ్ల నెట్‌వర్క్ అభివృద్ధి, తాగునీటి సరఫరా, ఉపాధి కల్పన, శాటిలైట్ టౌన్‌షిప్‌ల అభివృద్ధి చేయాలనే లక్ష్యంగా ఈ అథారిటీలను ఏర్పాటు చేసినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వనపర్తి జిల్లా అభివృద్ధిలో భాగంగానే వనపర్తి టౌన్, ఐదు మున్సిపాలిటీలు, 215 గ్రామాలను కలుపుకుని వనపర్తి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో వేములవాడ మున్సిపాలిటీతోపాటు 152 గ్రామాలను కలిపి వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు చేశారు. సూర్యపేట జిల్లా కేంద్రంగా సూర్యపేట మున్సిపాలిటీతో పాటు ఐదు మున్సిపాలిటీలు, 264 గ్రామాలను కలిపి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, సిద్దిపేట్ జిల్లాలో సిద్దిపేట్ మున్సిపాలిటీతో పాటు 4 మున్సిపాలిటీలు, 286 గ్రామాలతో సిద్దిపేట్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేశారు. ఖమ్మం జిల్లాలో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు రెండు మున్సిపాలిటీలు, 279 గ్రామాలతో స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేశారు. వికారాబాద్ జిల్లాలో వికారాబాద్ మున్సిపాలిటీతో పాటు 4 మున్సిపాలిటీలు, 492 గ్రామాలతో వికారాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, కరీంనగర్ జిల్లాలో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు 3 మున్సిపాలిటీలు, 147 గ్రామాలతో శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేశారు. సంగారెడ్డి జిల్లాలో సంగారెడ్డి మున్సిపాలిటీతో పాటు 5 మున్సిపాలిటీలు సంగారెడ్డి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, 5 మున్సిపాలిటీలు, 466 గ్రామాలు, నిజామాబాద్ జిల్లాలో నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు 3 మున్సిపాలిటీలు, 380 గ్రామాలతో నిజామాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, నిర్మల్ జిల్లాలో నిర్మల్ మున్సిపాలిటీతోపాటు మూడు మున్సిపాలిటీలు, 420 గ్రామాలతో నిర్మల్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, మహబూబాబాద్ జిల్లాలో టౌన్‌తో పాటు 4 మున్సిపాలిటీలు, 159 గ్రామాలతోపాటు మహబూబాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేశారు. నాగర్ కర్నూల్ జిల్లాలో టౌన్‌తో పాటు 4 మున్సిపాలిటీలు, 319 గ్రామాలతో నాగర్ కర్నూల్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, మంచిర్యాల్ జిల్లాలో 6 మున్సిపాలిటీలు, 350 గ్రామాలతో మంచిర్యాల్ అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ, మహబూబ్‌నగర్ జిల్లాలో మున్సిపాలిటీతో పాటు 153 గ్రామాలతో మహబూబ్‌నగర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రెండు మున్సిపాలిటీలు, ఒక గ్రామతో పాటు కొత్తగూడెం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు చేశారు. కామారెడ్డి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో 3 మున్సిపాలిటీలు, 460 గ్రామాలు ఉన్నాయి. కొమురంభీం-ఆసిఫాబాద్ జిల్లాలోని రెండు మున్సిపాలిటీలు, 199 గ్రామాలతో కాగజ్ నగర్ అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ, 4 మున్సిపాలిటీలు, 194 గ్రామాలతో జోగులాంబ గద్వాల్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, ఆదిలాబాద్ టౌన్‌తో పాటు ఒక మున్సిపాలిటీ, 107 గ్రామాలతో ఆదిలాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేశారు.

## 31 వసతి గృహాల్లో అధికారులు రాత్రి బస

మొదటి పేజీ తరువాయి

అల్పాహారం చేసి, వసతి గృహాల్లో అవసరమైన, అత్యవసర మరమ్మత్తులు వివరాల సేకరణ చేయాలని సూచించడం జరిగిందని తెలిపారు. 31 వసతి గృహాల్లో అధికారులు విద్యార్థుల స్టడీ అవర్స్ గమనించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజన, వసతి సదుపాయాలు, విద్యా బోధన, రోజువారీ దినచర్య, మెనూ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టడీ అవర్స్ కొనసాగుతున్న గదులను సందర్శించి విద్యార్థులతో అధికారులు భేటీ అయ్యారు. పదవ తరగతి, ఇంటర్ విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి వారి సామర్థ్యాన్ని పరిశీలించారు. ప్రభుత్వ పరంగా వారికి అందించిన పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్కులు పరిశీలించారు. అన్ని తరగతి గదులను, డార్మెటరీ, కిచెన్, డైనింగ్ హాల్ తదితర వాటిని సందర్శించి అందుబాటులో ఉన్న వసతి సదుపాయాలు పరిశీలన జరిపారు. స్టోర్ రూమ్ లో నిలువ ఉంచిన సరుకుల నాణ్యతను తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి వసతి గృహాల్లో నిద్రించారు. వసతి గృహాల్లో అవసరమైన అత్యవసర మరమ్మత్తులు, అలాగే త్రాగునీరు సమస్యలు, వసతి గృహాల్లో అధికారులు సేకరించిన సమస్యల పై పూర్తి వివరాలతో శనివారము కలెక్టరేట్ లో సమావేశంనిర్వహించ బడునని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.





## రూ. 10 నాణేలు చట్టబద్ధవైనవే

మొదటి పేజీ తరువాయి

రూ. 10 నాణేలు చెల్లుబాటులోనే ఉన్నాయని ఇప్పటికే పలుమార్లు స్పష్టతనిచ్చిన విషయం తెలిసిందే. తాజాగా, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక జనరల్ మేనేజర్ ధారాసింగ్ నాయక్ దీనిపై క్లారిటీ ఇచ్చారు. రూ. 10 నాణేలు చట్టబద్ధవైనవేనని వీటిని రోజువారీ లావాదేవీలకు ఉపయోగించవచ్చని తెలిపారు. వీటి చలాహమణిని వ్యాపార లావాదేవీలకు వినియోగించాలనే ఆర్బీఐ ఉత్తర్వుల మేరకు విస్తృత అవగాహన కల్పించేలా చర్యలు చేపడుతున్నట్లు ధారాసింగ్ తెలిపారు. హైదరాబాద్ కోఠిలోని బ్యాంక్ శాఖ వద్ద రూ. 10 నాణేల చలామణిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ధారా సింగ్ మాట్లాడుతూ తమ ఖాతాదారులకు పది రూపాయల నానేలు వినియోగించుకోవాలని సూచిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే ఆర్టీసీ బస్సుల్లోనూ ఈ నాణేలు చెల్లుబాటు అవుతున్నాయన్నారు.ప్రజల్లో రూ. 10 నాణేలపై ఉన్న అపోహలను తొలగించేందుకే ఈ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి అనుమానాలకు తావు లేకుండా ఈ నాణేలను లావాదేవీలకు చలామణి చేయవచ్చని, రూ. 10 నోటు కంటే నాణేం ఎక్కువ కాలం మన్నికతో ఉంటుందని జనరల్ మేనేజర్ ధారా సింగ్ తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఖాతాదారులకు రూ. 10 నాణేలను అందజేశారు.

## హైదరాబాద్ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

మొదటి పేజీ తరువాయి

ప్రారంభోత్సవ సభలో మాట్లాడిన ఆయన పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఉత్తమ్ మాట్లాడుతూ రియల్టర్లతో పాటు నిర్మాణదారులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని, పాలనాపరమైన అభివృద్ధి ఇకపై సులభతరం కానుందని తెలిపారు. ఇప్పటికే అనుమతులు పొందిన వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, క్రెడాయి మరియు ట్రెడాలు ప్రత్యేకమైన కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రియల్టర్ల సమస్యల పరిష్కారానికి ఈ కమిటీలతో చర్చించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్దంగా ఉందని స్పష్టం చేశారు. ఇక అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్ అభివృద్ధి చెందుతోందని, ఈ అభివృద్ధిలో రియల్టర్లు, బిల్డర్లు భాగస్వామ్యం కావాలని కోరారు. అభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వానికి స్పష్టత ఉందని, హైదరాబాద్ అభివృద్ధికి రాష్ట్ర బడ్జెట్‌లో 10 వేల కోట్లు కేటాయింపులు చేసిందని గుర్తు చేశారు. ఔటర్ రింగ్ రోడ్ నిర్మించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని, రీజనల్ రింగ్ రోడ్ నిర్మాణంతో నగరాభివృద్ధికి శ్రీకారం చుట్టామని, దీంతో పాటు కనెక్టివిటీ రోడ్లను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ట్రాఫిక్ క్రమ బద్ధీకరణకు చర్యలు తీసుకుంటున్నామని, మెట్రో విస్తరణను వేగవంతం చేసిందని, త్రాగు నీటి సామర్థ్యం పెంపు అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందని వివరించారు. ఇక ప్రముఖ పారిశ్రామిక వేత్త ఆనంద్ మహీంద్రా ఆధ్వర్యంలో వృత్తి నైపుణ్య విశ్వవిద్యాలయం, అంతర్జాతీయ స్థాయిలో క్రీడా విశ్వవిద్యాలయం నెలకొల్పేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి ఉత్తమ్ తెలిపారు.

## ధర్నాలతో దద్దరిల్లుతోంన్న తెలంగాణ

మొదటి పేజీ తరువాయి

మొదలు పోలీస్ కుటుంబాల వరకు, అవ్వాతాతల నుంచి మొదలు ఆడబిడ్డల వరకు, విద్యార్థుల నుంచి మొదలు విద్యావంతుల వరకు, నిరుద్యోగుల నుంచి మొదలు ఉద్యోగుల వరకు, కాంగ్రెస్ ప్రజాపతినిధుల నుంచి మొదలు ప్రతిపక్ష నాయకుల వరకు, ఒక్కరా ఇద్దరా ముగ్గురా మూలకున్నా ముసలవ్వ మొదలు బడిపిల్లల దాక ధర్నాలు నిరసనలు చేస్తున్నారని చెప్పారు. జనం నోటా ఆడా ఇడా అంతటా ఒకటే స్లోగన్ వద్దురా నాయన కాంగ్రెస్ పాలన అని విమర్శించారు. ముందు దగా-వెనక దగా.. కుడి ఎడమల దగా.. దగా.. కాంగ్రెస్ వచ్చింది-కష్టాలు తెచ్చిందని కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఎలాంటి బాంబులకు భయపడేది లేదు.**

బీఆర్ఎస్ ప్రభుత్వంలో అక్రమాలకు పాల్పడిన నేతల అరెస్టులు తప్పవని, త్వరలోనే బాంబులు పేలతాయంటూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఎలాంటి బాంబులకు భయపడేది లేదని తేల్చిచెప్పారు. చంద్రబాబు, వైఎస్ఆర్ వంటి వారితోనే పోరాటం చేశామని మీరో లెక్కా అంటూ విరుచుకుపడ్డారు. పొంగులేటి బాంబులు తుస్సే అంటూ మాజీ మంత్రి వ్యాఖ్యలు చేశారు. ఏం పీక్కుంటారో పీక్కోండి. నీ బాంబులకు భయపడలేదు, కేసులకు భయపడేది లేదు. మేం ఒరిజినల్ బాంబులకే భయపడలేదు. దొంగ కేసులు పెడితే పెట్టుకో. నీ ఈడీ కేసులు, మోడీ కాళ్ళు మొక్కిన బాంబుల గురించి చెప్పు. చంద్రబాబు, వైస్సార్‌తోనే కొట్లాడినం ఈ చిట్టి నాయుడు ఓ లెక్కనా. అడ్డమైన కేసులు పెట్టి జైలుకు పంపితే పంపు ఆర్ఆర్ టాక్స్‌లపై మేం వచ్చాక లెక్క తెలుస్తాం. సీఎం రేవంత్ బామ్మర్ది, పొంగులేటి బాగోతాలు అన్నీ బయటకు తీస్తాం. చావుకు మేం భయపడం అంటూ కేటీఆర్ స్పష్టం చేశారు.

## పేదలకు మంచి చేసే విషయంలో రాజకీయాలొద్దు

మొదటి పేజీ తరువాయి

వేం నరేందర్ రెడ్డి, మేయర్ విజయలక్ష్మి ఇవాళ నగరానికి చేరుకున్నారు. వారికి అభిమానులు శంషాబాద్ విమానాశ్రయంలో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ ఒకప్పుడు సియోల్ హైదరాబాద్ లాగే ఉండేదని, అక్కడి భౌగోళిక పరిస్థితులు, జనాభా, మురికి నీటి నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండేదని అన్నారు. ప్రణాళికా బద్ధంగా ముందుకెళ్లడంతో అద్భుతమైన ప్రగతిని సాధించారని వివరించారు. ప్రస్తుతం సియోల్ సమీపంలో స్మార్ట్ సిటీ, స్పోర్ట్స్ సిటీ నిర్మితమయ్యాయని అన్నారు. మూసీ మురికి కుంపటిలో దుర్భరమైన జీవితం అనుభవిస్తున్న వారికి మంచి జీవితం ఇవ్వాలన్న తలంపుతోనే సీఎం రేవంత్ రెడ్డి ఆగస్టులో సియోల్ వెళ్లి అక్కడి జీవన స్థితిగతులను చూసి వచ్చారని చెప్పారు. సమగ్ర అధ్యయనం కోసం తమను పంపారని అన్నారు. తాము పరిశీలించిన అంశాలపై ఒకటి రెండు రోజుల్లో క్యాబినెట్ కు సమగ్ర నివేదిక ఇస్తామని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మూసీ రివర్ బెడ్ లో నివసించే ప్రతి కుటుంబానికీ ప్రభుత్వం అండగా ఉంటుందని పొంగులేటి చెప్పారు.

## వాయుకాలుష్య ప్రమాదాలకు సంసిద్ధతను పెంచాలి

మొదటి పేజీ తరువాయి

దీర్ఘకాలిక వ్యాధుల పురోగతిని మరింత తీవ్రతరం చేస్తుందని ఆయన అన్నారు. పిల్లలు, గర్భిణీ స్త్రీలు మరియు వృద్ధుల వంటి బలహీన వర్గాలకు ప్రతికూల ప్రభావాలు ముఖ్యంగా తీవ్రంగా ఉంటాయని డాక్టర్ గోయెల్ తెలిపారు. ప్రజల అవగాహన ప్రచారాలను తీవ్రతరం చేయాలని, ప్రాంతీయ భాషలలో నియమించబడిన మాస్ మీడియా ఛానెల్‌ల ద్వారా లక్ష్య సందేశాలను వ్యాప్తి చేయాలని, ఆరోగ్య సంరక్షణ శ్రామికశక్తి సామర్థ్యాన్ని బలోపేతం చేయాలని మరియు వాయు కాలుష్య సంబంధిత వ్యాధుల కోసం సెంటినెల్ నిఘా వ్యవస్థలలో భాగస్వామ్యాన్ని పెంచాలని డాక్టర్ గోయెల్ రాష్ట్రాలను కోరారు.

## రాష్ట్రంలో పత్తి రైతులకు మంత్రి, తుమ్మల గుడ్ న్యూస్

మొదటి పేజీ తరువాయి

అమ్మకం, కొనుగోలుకు సంబంధించిన వివరాలు అందించేందుకు వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సిద్ధమైంది. మంత్రి తుమ్మల ఆదేశాల మేరకు పత్తి పంట క్రయవిక్రయాలలో ఎలాంటి జాప్యం జరగకూడదని ఈ సేవలను ప్రారంభించింది. పత్తి కొనుగోళ్లు, అమ్మకం, అర్హత, తదితర వివరాలు, చెల్లింపు స్థితి, సీసీఐ సెంటర్లలో వేచి ఉండే సమయం వంటి వివరాలను రైతులు తమ ఇంటి వద్దనే ఉండి ఈ నెంబర్ ద్వారా తెలుసుకోవచ్చని మంత్రి తెలిపారు. రైతులందరూ మార్కెటింగ్ శాఖ తీసుకొచ్చిన ఈ వాట్సాప్‌ను ఉపయోగించి ఎలాంటి ఇబ్బందులు పడకుండా పత్తిని విక్రయించుకోవాలని రైతులకు తెలిపారు. పింజ రకము(బీబీ మోడ్)క్వింటాకు రూ.7521, (పింజ పొడవు 29.5 నుంచి 30.5(మి. మీ), మైక్రోనీర్ విలువ 3.5 నుంచి 4.3) గా, పింజ రకము (బీబీ ఎస్పీ ఎల్) క్వింటాకు రూ.7471( పింజ పొడువు (మి. మీ) 29.01 నుండి 29.49, మైక్రోనీర్ విలువ 3.6 నుండి 4.8) గా, పింజ రకము (మెక్) క్వింటాకు రూ.7421 (పింజ పొడువు (మి. మీ) 27.05 నుంచి 28.5, మైక్రోనీర్ విలువ 3.5 నుండి 4.7) గా పత్తికి కనీసం మద్దతు ధర ప్రభుత్వం ప్రకటించడం జరిగిందన్నారు. పత్తిలో తేమ 12% మించకుండా ఉండాలని, 8% నుంచి 12% మధ్య ఉన్న పత్తికి మాత్రమే మద్దతు ధర లభిస్తుందని మంత్రి తెలిపారు. తేమ శాతం ఎక్కువగా ఉన్న పత్తికి తక్కువ మద్దతు ధర లభిస్తుందని, రైతులు తమ పత్తిని పూర్తిగా ఎండబెట్టి తేమ శాతం తక్కువగా ఉందని నిర్ధారించుకున్న తర్వాతనే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకొచ్చి అమ్ముకోవాలని సూచించారు. పత్తిని సులభంగా విక్రయించేందుకు మార్కెటింగ్ శాఖ అన్నీ రకాల ఏర్పాట్లు చేస్తుందని, రైతులంతా మార్కెటింగ్ శాఖ తీసుకొచ్చిన వాట్సాప్ చాట్ ఉపయోగించి ఎలాంటి ప్రయాసాలు పడకుండా పత్తిని అమ్ముకోవాలని రైతులను కోరారు. రైతులు ఎటువంటి ఫిర్యాదులు చేసినా మార్కెటింగ్ శాఖ సత్వరమే స్పందించి పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

తీన్మార్
తెలుగు దినపత్రిక

## బిజెపికి కళ్లెం వేసే ఉంచాలి!

దేశ పాలనా రథానికి ఏ గుర్రాలు కట్టాలో దేశ పౌరులకు బాగా తెలుసు. మోడీ పదేళ్ల పాలన చూశాక ఓటర్లకు ఓ కొత్త ఆలోచన వచ్చింది. బిజెపి చేతిలో పగ్గాలు పెట్టినా పూర్తిగా వదిలేయకూడదని వారు అనుభవపూర్వకంగా నేర్చుకున్నారు. అందుకే గతంలో కన్నా ఈసారి లోక్‌సభలో 63 సీట్లు తగ్గించి అదుపులో ఉంచుకున్నారు. దేశంలోని రెండు ప్రధాన పార్టీల శక్తియుక్తులను సరిగ్గా అంచనా వేసిన జనం మోడీ జట్టును గెలిపించి, ఆయనకు ఎంత బలాన్ని ఇవ్వాలో కొలత వేసి మరీ అందించారు. ఇప్పుడు ఎన్‌డిఎలోని పక్షాలు దూరమైతే మోడీ ప్రభుత్వం కొనసాగే అవకాశం లేదు. ఈ పరిస్థితి బిజెపికి గత పదేళ్లలో రాలేదు. ఇదే జనం కోరుకున్నది కూడా. మోడీకి అన్ని విద్యలూ తెలుసు. దేశంలో ఇప్పుడు ఆయనకు సాటి రాజకీయనేత లేరని ఎన్నో సర్వేలు చెబుతున్నాయి. ఆయనను కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీతో తులనాత్మక విశ్లేషణ చేయడం కూడా అనవసరం. కాంగ్రెస్‌లో రాహుల్‌ను మించినవారు, రాజకీయ ఉద్దండులు ఉన్నా ఆ పార్టీకి యువరాజే అన్నీ. పార్టీని నమ్ముకున్నందుకు ఆయన పట్టాభిషేకం కోసం నేతలందరూ తంటాలు పడుతున్నారు. అయితే ప్రపంచ స్థాయి నాయకత్వ సూచీల ప్రకారం మోడీ దరిదాపుల్లో కూడా రాహుల్ కనబడడం లేదు. రాజకీయ క్రీడల్లో మోడీ మైదానం అంచుల దాక వెళ్లి అనుకున్నది సాధించగలరు. ఆ సామర్థ్యం ఉన్నవారు బిజెపిలో కాని, దేశంలో కాని మరొకరు లేరనే చెప్పాలి. అయితే మోడీ లక్ష్యాలు వేరు. ఆయనకు పూర్తి మెజారిటీ ఇచ్చిన పదేళ్ల కాలంలో ఆయన ప్రభుత్వ సంస్థలను నిర్వీర్యం చేయడం, బలంగా ఉన్నవాటిని ప్రైవేటుపరం చేయడం జరిగింది. పూర్తిగా పారిశ్రామికవేత్తల అనుకూల పాలన కొనసాగింది. ఆయనకు అదెంతో సంతృప్తిని ఇచ్చి ఉండాలి. మరో వైపు ఆ కాలంలో హిందూ మత ఛాందసం విర్రవీగింది. దళితులకు, మైనారిటీలకు రక్షణ కరువైంది. ఆ చర్యలను మోడీ ఎన్నడూ ఖండించలేదు. వారు ఆ హద్దుల్లో ఉండాల్సిందే అని ఆయన కూడా భావించి ఉంటారు. మోడీ సంపూర్ణంగా అగ్రకుల హిందువుల పక్షపాతి అని కొత్తగా రుజువు పరిచే అవసరం లేదు. జనాభాలో 2% ఉన్న అగ్రకులాలకు ఆయన ఇడబ్ల్యుఎస్ పేరిట 10% రిజర్వేషన్లు కల్పించడం బహుజన సమ్మతంకాదు. ఇక సబ్ కా వికాస్ అన్నది నామమాత్ర నినాదమే. ఆయన పాలనలో ముస్లిం లు ఏమాత్రం సంతోషంగా లేరు. దళితులు కులనిమ్నతకు కట్టివేయబడ్డారు. ఆర్టికల్ 370ని రద్దు చేసి కశ్మీర్ స్వయం ప్రతిపత్తిని తొలగించిన పరిణామాలను ఇటీవలి జమ్మూకశ్మీర్ ఎన్నికల ఫలితాల్లో చూశాం. ట్రిపుల్ తలాక్ రద్దు అనేది తమ సాంప్రదాయిక వ్యవహారాల్లో వేలు పెట్టడమే అని ముస్లిం సమాజం భావిస్తోంది. పూర్తి స్వేచ్ఛను ఇస్తే ఇలాంటి ఇబ్బందులు మరిన్ని తప్పవని సామాన్య జనం గ్రహించింది. బిజెపిని భయంలో ఉంచుకోకపోతే తమకు నష్టమే అని వారికీ తెలుసు. దీని ప్రభావం 2024 సాధారణ ఎన్నికల్లోనే కాకుండా ఆ తర్వాత జరిగిన, జరగబోయే ఎన్నికల్లో కూడా కనబడుతుంది. హర్యానాలో గెలుపు వ్యూహ ఫలితమే కానీ నిజమైన విజయం కాదు. 'ఇండియా' కూటమిలో కాంగ్రెస్, ఆప్ మధ్యన సీట్ల సర్దుబాట్లు కుదరక ఎవరికివారు పేరాశపడడంతో ఇద్దరి కొంపమునిగింది. ఇక నవంబర్‌లో జరగబోయే జార?ండ్, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు మోడీ పాలన కన్నా ఆయన ప్రతిష్ఠకు పరీక్షగా చూడాలి. ఈ రెండు రాష్ట్రాల్లో మోడీ 2.0 పాలనలో సాగిన రాజకీయ విన్యాసాన్ని ఆయన రాజకీయ చాణక్యనీతికి పరాకాష్ఠగా భావించాలి. కేంద్రంలో పూర్తి మెజారిటీ ఉన్నపుడు రాష్ట్రాల్లోని ప్రాంతీయ పార్టీలకు విలువే లేకుండా పోయింది. ఇప్పుడు సీను మారిపోయింది. ఒకనాడు లెక్కలోకి రాని చంద్రబాబు ఇప్పుడు మోడీని ఆడుకొనే దశకు చేరిపోయాడు. ఇలా మోడీకి పగ్గాలు పడాల్సిందే! ఈ పరిస్థితికి లోలోన మదనపడుతున్న మోడీ తన గత వైభవాన్ని తిరిగి చేరుకోవాలని తీవ్రంగా కోరుకుంటున్నారు. ఒకరు పంచన బతికే బతుకు ఆయనకు ఇష్టముండదు. జార?ండ్, మహారాష్ట్రలో ఎన్నికల్లో కూడా ఎన్‌డిఎ కూటమికి అనుకూలత తక్కువే. అక్కడ కాంగ్రెస్ కూటమికి అవకాశాలు పెరుగుతున్నాయి. ఢిల్లీలో కేజ్రీవాల్ సానుభూతి పవనాల ఆశతో ఎన్నికలకు సిద్ధంగా ఉన్నాడు. వీటి ఫలితాలు ఎలా ఉన్నా దేశంలో ఓటర్లను తిరిగి తనవైపు తిప్పుకోవడానికి మోడీ కొత్త ప్రణాళికలు వేస్తున్నారు. కేవలం మతం, భక్తి భావనలు హిందూ ఓట్లను గంపగుత్తగా రాబట్టలేవని అద్వానీ కాలం నుండే రుజువు అవుతోంది. అయోధ్య ఆలయానికి రూ. 3500 కోట్లు అర్పించిన జనం అదే చోట బిజెపిని గెలిపించకపోవడం ఆ పార్టీకి చక్కని గుణపాఠమే. ఉన్నంతలో హిందూ ఓటు బ్యాంకు చెక్కుచెదరదు. అయితే అదొక్కటే పార్టీని గట్టెక్కించలేదు. అందుకే ప్రజలను ఆకర్షించే నిర్ణయాలు కొన్నయినా తీసుకోవాలి అనే ఆలోచన ఇప్పుడు కార్యరూపం దాల్చుతోంది. తన ప్రాభవాన్ని వెనక్కి తెచ్చుకొనేందుకు మోడీ గత నిర్ణయాల సవరణ బాట పట్టారు. వాటిలో ప్రధానమైన వాటిని పరిశీలిద్దాం. కేంద్ర ప్రభుత్వం ఆగస్టు లో ఆమోదించిన యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్, సెప్టెంబర్‌లో ప్రకటించిన 70 ఏళ్లు పైనబడినవారికి ఆరోగ్యం బీమా పథకం ప్రభుత్వంపై ఆర్థిక భారాన్ని మోపేవే. అయితే ఈ రెండు పథకాలు బిజెపి ఓట్ల శాతాన్ని గణనీయంగా పెంచుతాయి. 2004 నుండి పాత పింఛను విధానం కోల్పోయినందుకు ఉద్యోగ వర్గాలు చాలా నిరాశలో ఉన్నాయి. జాతీయ పింఛన్ విధానం ఉద్యోగుల విశ్రాంత జీవితానికి పూర్తి భరోసా ఇవ్వలేదు. మధ్యే మార్గంగా రూపొందించిన సమీకృత పింఛన్ విధానం కొంత ఆశాజనకంగా ఉంది. 50% చివరి జీతం, 60% ఫ్యామిలీ పెన్షన్, 10 ఏళ్ల సర్వీసుకు రూ.10 వేల పెన్షన్ దీనిలోని ప్రత్యేకతలు. ఇక 70 ఏళ్లు పైబడిన వారందరికీ రూ.5 లక్షల ఆరోగ్య బీమా ఇప్పటికే ఎంతో ప్రచారంలోకి వెళ్ళింది. దేశమంతా దీన్ని సంబరంగా ఆహ్వానిస్తున్నారు. ఎలాంటి నిబంధనలు లేకుండా ఆ వయస్కులందరికీ ఇది వర్తిస్తుంది అనడమే దీని ప్రధాన ఆకర్షణ. బీమా ఆశించే సీనియర్ సిటిజన్ల కుటుంబాలు అన్నీ మోడీకి బాసటగా నిలుస్తాయి. దేశంలోని 90 కోట్ల ఓటర్లలో 30 కోట్లకు పైగా వీటి పరిధిలోకి వస్తారు. అయితే సామాన్య ప్రజలపై ప్రేమతో ఈ సంక్షేమ పథకాలను మోడీ స్వయంగా ప్రకటించినవిగా భావించకూడదు. కోల్పోయిన ఓట్ల సంఖ్యను సరిచేసుకునే మోడీ ప్రణాళికలో భాగంగానే చూడాలి.

# ప్రతి ఒక్కరూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

### రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అక్టోబర్ 25 (తీన్మార్ న్యూస్): అభివృద్ధి ఫలాలు సమాజంలోని ప్రతి ఒక్కరికి ముఖ్యంగా మారుమూల ప్రాంతాలలో ఉన్న నిరుపేద గిరిజనులకు అందేందుకు, తద్వారా మెరుగైన జీవితాలను అందించేందుకు సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ పిలుపునిచ్చారు. శుక్రవారం అయన భద్రాద్రి కొత్తగూడెం సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా అధికారులు, కళాకారులు, రచయితలు, ప్రముఖులతో నిర్వహించిన ముఖాముఖిలో పాల్గొన్నారు. జిల్లాకు వచ్చిన గవర్నర్ కు ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామిరెడ్డి, మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు బలరాం నాయక్, కొత్తగూడెం, భద్రాచలం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, తెల్లం వెంకట్రావు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటీడీఏ పీవో బి. రాహుల్ , ఎస్పీ రోహిత్ రాజ్,అధికారులు ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర గవర్నర్ సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయ ఆవరణలో వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్ ను సందర్శించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించి జిల్లా అధికారులు, ప్రముఖులతో సమావేశ మందిరంలో ముఖాముఖి సమావేశం అయ్యారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ జిల్లా ప్రాముఖ్యతను, సంస్కృతి, సంప్రదాయాలను, వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న ముఖ్యమైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గవర్నర్ కు తెలియజేశారు. అనంతరం రాష్ట్ర గవర్నర్ విష్ణు దేవ్ వర్మ మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు తీరు బాగుందని ప్రశంసించారు. ముఖ్యంగా 2021లో 73 శాతం ఉన్న రక్తహీనత 2024 నాటికి 21 శాతానికి తీసుకురావడం అభినందనీయమని, ఇందుకు జిల్లా యంత్రాంగం తీసుకున్న చర్యలను పూర్తి వివరాలతో సమర్పిస్తే రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలలో, ఆదివాసి గిరిజన గ్రామాలలోని గిరిజన కుటుంబాలకు రక్తహీనత నివారించేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఉన్న 481 గ్రామపంచాయతీలు బహిరంగ మలమూత్ర విసర్జన రహిత గ్రామాలుగా ప్రకటించడం సంతోషమని, స్వచ్ఛభారత్ అనేది ఒక కార్యక్రమం కాదని, ఇదొక ఉద్యమమని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలలో జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలు, గిరిజన కుటుంబాలను భాగస్వామ్యం చేయాలని, ప్రత్యేకించి భద్రాద్రి కొత్తగూడెం లాంటి జిల్లాలోని ప్రజలను దారిద్రరేఖ నుండి పైకి తీసుకువచ్చేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, రచయితలు, కళాకారులు అందర్నీ భాగస్వాములు చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో స్వయం సహాయక మహిళా సంఘాల కార్యక్రమాలు అలాగే ఆదివాసి గిరిజన మహిళలు తయారుచేసిన గిరిజన వంటకాలు చాలా బాగున్నాయని, భవిష్యత్తు అభివృద్ధి మహిళా సాధికారత పై ఆధారపడి ఉందని, ఈ విషయం తాను కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన స్టాల్స్ సందర్శన సందర్భంగా సహాయక మహిళలు, గిరిజన మహిళలు వారు తయారు చేసిన చేతి వృత్తుల ప్రదర్శన, వంటకాలలో గుర్తించానని చెప్పారు. అలాగే స్వయం శక్తితో ఉపాధి కల్పించుకొని విజయాలు సాధించిన మహిళలు, గిరిజన మహిళల గురించి సమాజానికి తెలియజేయాలని అప్పుడే ఇతరులు వారిని స్ఫూర్తిగా పొంది అభివృద్ధి చెందుతారని అన్నారు . మహిళల చేతుల్లో డబ్బు ఉన్నప్పుడు ఆర్థిక సాధికారత వస్తుందని అన్నారు. ప్రస్తుతం ఉన్న జీవన పరిస్థితుల మెరుగు కోసం కృషి చేయడం చాలా ముఖ్యమని, సమాజంలో ఉన్న చివరి మనిషి వరకు అభివృద్ధి ఫలాలు చేరాల్సిన అవసరం ఉందని అన్నారు. దేశంలోని ప్రతి ఒక్కరూ అభివృద్ధిలో భాగస్వామ్యం అయితే వికసిత్ భారత్ సాధ్యమన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య ఆరోగ్యం, విద్య రంగాలను పరిశీలిస్తే మెరుగైన స్థానంలో ఉన్నాయని, ప్రత్యేకించి విద్యలో 2024లో పదో తరగతిలో 90.6% గిరిజన సంక్షేమ శాఖ గిరిజన విద్యార్థులు పదో తరగతిలో 92 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు తరగతి గదుల్లో విద్యతోపాటు, చిన్న చిన్న చేతివృత్తులకు సంబంధించిన వస్తువుల తయారీ, చిన్న చిన్న పరికరాల వంటివి తెలియజేస్తే వారు ఇంకా విజ్ఞానవంతులు కావడానికి అవకాశం ఉందని అన్నారు. అలాగే ప్రతి విషయాన్ని ప్రజలకు తెలియజేయడం ద్వారా వారు ఎక్కువ జ్ఞానాన్ని పొందేందుకు ఆస్కారం ఉందన్నారు. 2047 నాటికి ఇండియా అన్ని రంగాలలో అభివృద్ధి సాధించి వికసిత్ భారత్ కావాలని ఆయన ఆకాంక్షించారు. సమాజం అంటే సంపద కాదని, సమాజం అంటే సంస్కృతి అని ఆయన చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నదులు, అటవీ సంపద, బిపిఎల్, కె టి పి ఎస్, జెన్కో, భారత్ జల నీటి శుద్ధి కర్మాగారం, సింగరేణి గనులు ఉన్నాయని, నిరుద్యోగులైన అన్ని వర్గాల యువతకి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే జీవనోపాధి పెంపొందించు కోవడానికి అవకాశం ఉంటుందని అన్నారు. భద్రాచలం, పర్ణశాల లోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయాల పరంగా పర్యాటక శాఖను అభివృద్ధి చేసుకొని ఉపాధి అవకాశాలు కల్పించుకోవచ్చని, విద్య, ఆరోగ్యం, కల్చరల్ , వ్యవసాయం ఉపాధి అవకాశాలలో జిల్లాకి జిల్లాకి మధ్య పోటీ తత్వం ఉంటే అభివృద్ధి అనేది తప్పనిసరిగా సాధ్యమవుతుందని ముఖ్యంగా గిరిజన గ్రామాలలో నివసిస్తున్న మారుమూల ప్రాంత కొండ రెడ్ల గిరిజన విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని కొండరెడ్ల కుటుంబాల అభివృద్ధికి పాటుపడాలని, జిల్లాలోని ఏజెన్సీ ప్రాంత గిరిజన రైతులే కాకుండా ఇతర రైతులు కలానుగుణంగా పంటలు పండించుకొని వృద్ధి లోకి రావాలని అన్నారు. గిరిజనుల సంక్షేమం కోసం పాటుపడుతున్న అధికారులు ముఖ్యంగా గిరిజన గ్రామాలలో కావలసిన మౌలిక సదుపాయాలు విద్యా వైద్యం వ్యవసాయం చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటు విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటే తప్పనిసరిగా గిరిజనులు అభివృద్ధిలోకి వస్తారని అన్నారు. జిల్లాలోని ప్రతి గ్రామంలో వైద్యశాలలు బాగా పనిచేయాలని, మారుమూల ప్రాంతాలలో ఉన్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్లను సక్రమంగా నడిచే విధంగా చూడాలని అన్నారు. ప్రతి గ్రామంలో స్వచ్ఛమైన తాగునీరు సరఫరా కావాలని అన్నారు. జిల్లా అభివృద్ధి గురించి పవర్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా కలెక్టర్ వివరించిన విధానము చాలా బాగుందని ఆయన అన్నారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ జిల్లాలోని ముఖ్యమైన దేవాలయాలు, పరిశ్రమలు, గ్రామీణాభివృద్ధి, వైద్య ఆరోగ్యం ,విద్య, వ్యవసాయం, ఉద్యానం, సంక్షేమం ,నీటిపారుదల, విద్యుత్, పౌర సరఫరాలు, గిరిజన సంక్షేమం, తదితర ముఖ్యమైన శాఖల ద్వారా అమలు చేస్తున్న కార్యక్రమాలపై సవివరంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు. వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అవార్డులను సాధించిన పలువురు ప్రముఖులు, రచయితలు, కళాకారులు, సాహితీవేత్తలు, డాక్టర్లు, అడ్వకేట్లు వారి వారి రంగాలలో చేసిన కృషిని రాష్ట్ర గవర్నర్ తో పంచుకున్నారు. డాక్టర్ ప్రభు డేనియల్ రచయిత, సీతా ప్రసాద్ క్లాసికల్ డాన్సర్, వెంకటయ్య ఔషధ మొక్కల పెంపకం, కొండా విజయ్ కుమార్ సినిమా దర్శకుడు, ఎన్ రాజశేఖర్ ఉత్తమ తోట యజమాని, పశువుల అంజన కుమార్ ఆర్టిస్ట్, ఉయ్కే వెంకటలక్ష్మి శానిటరీ నాప్కిన్ మరియు మిల్లెట్ తయారీ తయారీ యజమాని, మోడం వంశీ పవర్ లిఫ్టింగ్ గోల్డ్ మెడలిస్ట్, ఏ శంకర్ గాయకుడు, వి కొండలరావు గాయకుడు, డాక్టర్ బుచ్చయ్య గాయకుడు, %ు%.శ్రీ తేజ నేషనల్ అథ్లెటిక్ బ్రౌన్స్ మెడల్, బట్టు శ్వేత వెయిట్ లిఫ్టింగ్, శ్రీరామ్ శెట్టి కాంతారావు పద్య రచయిత, ఆంగోతి శ్రీనివాసరావు పద్య రచయిత, పి రోశయ్య చౌదరి గాయకుడు, వెంగళ భాస్కర్ పాటల రచయిత, బి రిత్విక శ్రీ బ్యాట్మెంటన్ క్రీడాకారిణి, ఎస్ సీత రచయిత మరియు కవి, స్నేహ జానపద గాయని, ఎస్ ప్రభాకర చార్యులు రచయిత మరియు కవి, కే దుర్గా చారి రచయిత మరియు కవి, తురిమెళ్ళ కళ్యాణి రచయిత మరియు కవి, ఎస్ కృష్ణమూర్తి రచయిత, నాగరాజశేఖర్ రచయిత, జిల్లా అధికారులు, తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా జిల్లా యంత్రాంగం తరపున రాష్ట్ర గవర్నర్ విష్ణుదేవ్ వర్మను కవులు రచయితలు శాలువా, జ్ఞాపికతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఐఏఎస్ అధికారి మరియు ప్రిన్సిపల్ సెక్రెటరీ వెంకటేష్ శ్యామ్, జిల్లా అటవీ శాఖ అధికారి కృష్ణ గౌడ్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన,కొత్తగూడెం ఆర్డీవో మధు, భద్రాచలం ఆర్డీవో దామోదర్ రావు, మరియు జిల్లా అధికారులు ఐటిడిఏ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాష్ కి వినతి

**- కార్పొరేట్ హెయిర్ సెలూన్ ను వ్యతిరేకిస్తూ నిరసన**

**- నాయి బ్రాహ్మణుల పొట్ట కొట్టొద్దు**



నేరేడుచర్ల, అక్టోబర్ 25 (తీన్మార్ న్యూస్): నేరేడుచర్ల నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో కార్పొరేటర్ హెయిర్ సెలూన్ ను వ్యతిరేకిస్తూ నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాష్ కి వినతి పత్రం అందజేశారు. అనంతరం అధ్యక్షుడు మొగరాల వాసు మాట్లాడుతూ నేరేడుచర్లలో గత 30 సంవత్సరాలుగా నివసిస్తూ వృత్తిపరంగా హెయిర్ సెలూన్ ను నాయి బ్రాహ్మణ కుటుంబీకులు నిర్వహిస్తున్నారని వారి యొక్క వృత్తికి ఆటంకం కలిగిస్తూ గత కొంతకాలంగా ఇతర కులాలకు చెందిన వారు కార్పొరేటర్, హెయిర్ సెలూన్ ను ఏర్పాటు చేయడం దురదృష్టకరమని ఆయన అన్నారు. కార్పొరేటర్ హెయిర్ సెలూన్ వలన వృత్తిపరమైన నాయి బ్రాహ్మణలకు తగినంత పని లేక ఆర్థికంగా తీవ్ర నష్టం జరుగుతుందని చిత్తశుద్ధితో తక్షణమే ఇతర కులాలవారు ఇట్టి వృత్తిని మానుకోవాలని ఆయన అన్నారు. అదేవిధంగా నాయి బ్రాహ్మణులలో ఆర్థికంగా బలపడిన వారు కూడా కార్పొరేట్ హెయిర్ సెలూన్ మాన్కోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఒక చట్టం జీవో చేయాలి మానవుడు పుట్టుక నుండి చావు వరకు సేవలందిస్తున్న వారికి నాయి బ్రాహ్మణ వృత్తిపరంగా అన్యాయం జరగకుండా చూడాలి. నేరేడుచర్ల నాయి బ్రాహ్మణ సేవా అధ్యక్షులు మొగరాల వాసు, గౌరవ అధ్యక్షులు మొగరాల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కాపర్తి శీను, ఉపాధ్యక్షులు రాచమల్ల కృష్ణ, కార్యదర్శి మేడిపల్లి నాగయ్య, కోశ అధికారి.పిల్లుట్ల లక్ష్మణ్, వీరస్వామి, ఉదయ్, రాంప్రసాద్ పయ్యావుల వెంకన్న, పేరూరి శివ,నాగరాజ్, సతీష్, తిరుమలగిరి ఉపేందర్, కార్తీక్, నాగరాజు, వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

## వివిధ పాఠశాలలో ఎంఈఓ ఆకస్మిక తనిఖీ



పాలకవీడు, అక్టోబర్ 25 (తీన్మార్ న్యూస్): పాలకవీడు మండలంలోని వివిధ పాఠశాలలను మండల విద్యాశాఖాధికారి ఇంజమూరి కాటయ్య ఆకస్మికంగా సందర్శించారు మీగడం పాడు తండా, రాఘవపురం, హమ్మయ్య గూడెం ప్రాథమిక పాఠశాలను సందర్శించి ప్రధానోపాధ్యాయులు నుండి పాఠశాల విద్యార్థులు వివరాలను హాజరు శాతం, ఎఫ్ ఎల్ ఎన్ ఆధారంగా బోధనాభ్యసన కృత్యాల తీరును పరిశీలించారు. బోధనాభ్యసనశకృత్యంలో ఉపాధ్యాయులు విద్యార్థుల కుశసులభతరంగా అర్థమయ్యే రీతిలో బోధించాలని సూచించారు. ఉపాధ్యాయులను మధ్యాహ్న భోజనం మెనూగురించి అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల అభివృద్ధికి చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన వివిధ పాఠశాలల అభివృద్ధి నిర్మాణ పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో మౌలిక సౌకర్యాలు కల్పించే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. 2024 డిఎస్సీ లో ఎంపిక కాబడిన పాలకవీడు మండలానికి వివిధమండల పరిషత్ పాఠశాలలో 21 మంది నూతన ఉపాధ్యాయులు చేరటం జరిగిందని అదే విధంగా మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు అయిన పాలకవీడు జాన్ పహాడ్ బొత్తల పాలెం పాఠశాలలో ఒక్కొక్కరు చొప్పున మండల పరిధిలో మొత్తం24 మంది నూతన ఉపాధ్యాయులు విధులల్లో చేరారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యాపేట జిల్లాలో పాలక వీడు మండలం అగ్రభాగాన నిలిపేందుకు సమిష్టిగా కృషి చేస్తామని తెలిపారు.



## పాఠశాలకు మౌరిటేక్ వారి సౌజన్యంతో కంప్యూటర్ల అందజేత



మహబూబాబాద్ జిల్లా, అక్టోబర్ 25 (తీన్మార్ న్యూస్): పోగుల్లపల్లి జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో మౌరిటేక్ వారి సౌజన్యంతో, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో కంప్యూటర్లను పాఠశాలకు తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ, గ్రామీణ అభివృద్ధి శాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ అనసూయ సీతక్క అందజేశారు. ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ తల్లిదండ్రులు ప్రతి విద్యార్థిని విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చదువుపించాలి ఎక్కువ మొత్తంలో పిల్లలు ప్రభుత్వ బడులలో విద్యా బోధనకై చేర్పించాలి, నాణ్యత గల విద్యను అందించే ఉన్నత ట్రైనింగ్ పొందిన ఉపాధ్యాయుల ద్వారా పిల్లలకు విద్యను అందిస్తారు ప్రభుత్వ ఉద్యోగాలు రావాలన్న ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే చదువుపించాలి అన్నారు పాఠశాలలో మౌలికమైన వసతులు విద్యార్థులకు టాయిలెట్స్ సౌకర్యం, మంచినీటి సౌకర్యం, విద్యుత్ సౌకర్యం, కంప్యూటర్ సౌకర్యం ఇతర ఇతర సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ ఎటుర్ నగరం ప్రాజెక్ట్ డైరెక్టర్ చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు లెనిన్ వత్సల్ టోప్పో, అన్ని విభాగాల అధికారులు తదితరులు ఉన్నారు.

## హైడ్రా రాకతో మా 20 ఏళ్ల పోరాటానికి ఫలితం దక్కబోతుంది పద్మావతి నగర్ లేఔట్ బాధితులు

సంగారెడ్డి: సంగారెడ్డి జిల్లా అమీన్ పూర్ లోని పద్మావతి నగర్ లేఔట్ లో 20 ఏళ్ల కిందట 24 ఎకరాలను బాధితులు కొనుగోలు చేశారు. అయితే అప్పటి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి తమ ప్లాట్లను కబ్జా చేసి, ప్రహరీ గోడలు నిర్మించి బెదరింపులకు గురి చేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ పద్మావతి నగర్ లేఔట్ ను పరిశీలించి బాధితులకు న్యాయం చేస్తామని హామీనిచ్చారు. రంగనాథ్ ఆదేశాల మేరకు లేఔట్ లో అక్రమంగా నిర్మించిన ప్రహరీ గోడలను రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో తమకు న్యాయం జరుగుతుందన్న నమ్మకం ఉందని హైడ్రాకు, సీఎం రేవంత్ రెడ్డికి బాధితులు కృతజ్ఞతలు తెలియచేశారు

# బీసీ జాతీయ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రామన్ నియామకం



పెబ్బేరు, అక్టోబర్ 25 (తీన్మార్ న్యూస్): జాతీయ వెనుకబడినకులాల (బీసీ) సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా మరియు వనపర్తి జిల్లా ఇంచార్జిగా పెబ్బేరు మండలం తోమాలపల్లి గ్రామానికి చెందిన ఎస్. రామన్ గౌడ్ ను నియమిస్తూ బిసి సంక్షేమ జాతీయ సంఘం అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ హైదరాబాద్ రవీంద్రభారతిలో కార్యక్రమంలో నియామక పత్రం అందచేయడం. జరిగింది. ఈ సందర్భంగా రామన్ గౌడ్ మాట్లాడుతూ బీసీ కుల గణన వెంటనే చేపట్టి స్థానిక సంస్థల ఎన్నికలలో 42శాతం రిజర్వేషన్స్ కల్పించాలని వృత్తిదారుల మరియు బీసీల సమస్యలు పరిస్కరించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జాప్యం చేయకుండా వెంటనే కులగనన చేపట్టాలని స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ లకు 42 శాతం రిజర్వేషన్స్ అమలు చేయాలని ఎంబీసీలకు అవకాశం కల్పించే విధంగా ఏ,బి సి డి వర్గీకరణ చేయాలని చేయాలనీ అన్నారు రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని త్వరలో వనపర్తి జిల్లా వ్యాప్తంగా ప్రతి మండలం పర్యటించి మండల గ్రామ కమిటీ ఏర్పాటు చేయడం జరుగుతుంది ఈ అవకాశం కల్పించన శ్రీనివాస్ గౌడ్ మరియు సంఘం నాయకులకు కృతజ్ఞతలు తెలియచేస్తున్నాను అన్నారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా బి సి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నరు.

# పశు గణన నిర్వహణకు వచ్చే సిబ్బందికి సమాచారం అందించాలి



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, అక్టోబర్ 25 (తీన్మార్ న్యూస్): పశు మరియు ఇతర జంతువుల గణన నిర్వహణకు వచ్చే సిబ్బందికి సమగ్ర సమాచారాన్ని ఇవ్వాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో పశుగణన గోడ పత్రికను ఆవిష్కరించి 21వ అఖిల భారత పశు, ఇతర జంతువుల గణన కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అఖిల భారత పశుగణన ముఖ్య ఉద్దేశ్యం మేత, పాలు, పాల ఉత్పత్తుల నాణ్యతతో పాటు స్వయం ఉపాధి కోసం పాల ఉత్పత్తి సంఘాలను ప్రోత్సహించడం, పశువుల అభివృద్ధికి ఈ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమాచార సేకరణదారులు ప్రతి ఇంటికి వెళ్లి పశువుల సమగ్ర సమాచారం సేకరిస్తారని అన్నారు. ఈ గణన ప్రక్రియలో గేదెలు, ఆవులు, గొర్రెలు, మేకలు, బాతులు, కోళ్లు, వీధి కుక్కలు మొదలగు వాటి సంఖ్య సేకరిస్తారని అన్నారు. ఈ గణన ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి దేశవ్యాప్తంగా చేపడతారని తెలిపారు. జిల్లాలో గణన సేకరణలో 56 మంది సిబ్బంది, 11 మంది సూపర్ వైజర్లు, ఒక నోడల్ అధికారి పాల్గొననున్నారని తెలిపారు. జిల్లాలోని 253 గ్రామాల్లో గణన కార్యక్రమాలు జరుగుతాయని, ఇంటింటికి వచ్చే సిబ్బందికి పశువులు ఇతర జంతువుల సమగ్ర సమాచారం అందించి తద్వారా పశు గణ రంగ అభివృద్ధిలో పథకాల రూపకల్పనకు సహకరించాలని ఆయన సూచించారు. సేకరించిన సమాచారం ఎప్పటికప్పుడు పశుగణన యాప్ లో నిక్షిప్తం చేయబడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో ఈ గణన కార్యక్రమం 25.10.2024 నుండి 28.2.2025 వ తేది వరకు జరగనున్నదని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కుమారస్వామి, సహాయ సంచాలకులు డా గోపాలకృష్ణ మూర్తి, వెంకన్న, పశు వైద్యులు డా ప్రశాంత్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# ఖాకీ వనంలో కామపిశాచులు

- ఉద్యోగం నుంచి శాశ్వతంగా తొలగించాలి
- ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిన ఎన్హెచ్ఆర్సి జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్



హనుమకొండ, అక్టోబర్ 25 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో మహిళలు బాలికలపై అనేక లైంగిక దాడులు జరుగుతున్న నేపథ్యంలో మహిళలకు, బాలికలకు అండగా ఉండి కాపాడవలసిన శాంతి భద్రతల అధికారులు, ఉద్యోగులు కామపిశాచులుగా అవతారాలు ఎత్తుతున్న సంఘటనలు ఎంతో ఆవేదన కలిగిస్తున్నాయని జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్ హెచ్ ఆర్ సి) హనుమకొండ జిల్లా అధ్యక్షులు ఉచత శ్రీకాంత్ అభిప్రాయ వ్యక్తం చేశారు. రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గోరపూడి భాస్కరరావు, గ్రేటర్ వరంగల్ కమిటీ ప్రధాన కార్యదర్శి కోమాండ్ల శ్రీనివాస్ లతో కలిసి మాట్లాడుతూ మొన్నటికి మొన్న యాదాద్రి భువనగిరి జిల్లాలో మోటివేషన్ పేరిట కార్యక్రమం నిర్వహించి అమ్మాయిలపై అఘాయిత్యానికి ప్రయత్నం చేసిన లీగల్ డిపార్ట్మెంట్ కు చెందిన వ్యక్తి చేసిన ఘటన మరువక ముందుకే హనుమకొండ జిల్లాలో ఓ పోలీసు అధికారి బాలికపై లైంగిక దాడికి ప్రయత్నించడం క్షమించరానిదని అన్నారు. క్రమశిక్షణతో వృత్తి, ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తించి శాంతి భద్రతలను కాపాడాల్సిన ఖాకీ వనంలోని అధికారులు మహిళలు, బాలికల పట్ల కామపిశాచిలుగా ప్రవర్తించిన వారిని శాశ్వతంగా ఉద్యోగం నుంచి తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వానికి, పోలీస్ శాఖకు విజ్ఞప్తి చేశారు. ఇలాంటి సంఘటనలను ప్రవర్తన నియమావలి కింద పరిగణించి వారి పట్ల శిక్షలను కఠినతరం చేయాలని కోరారు. ఈ విషయంలో మా సంస్థ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మొగుళ్ళ భద్రయ్య సార్ ఆధ్వర్యంలో దేశ ప్రధానమంత్రికి, కేంద్ర హోంశాఖకు, అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు లేఖలు రాయనున్నట్లు తెలిపారు.

# మోడీ ప్రభుత్వ ప్రతిపాదనను వ్యతిరేకించండి

### సిపిఎం పిలుపు




పాలకవీడు, అక్టోబర్ 25 (తీన్మార్ న్యూస్): పాలకవీడు మండలంలోని గుడుగుంట్ల పాలెం గ్రామంలో జమిలి ఎన్నికలను మోడీ ప్రభుత్వ ప్రతిపాదనను వ్యతిరేకించాలి అనే కరపత్రాన్ని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కందగట్ల అనంత ప్రకాష్ ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో పంపిణీ చేశారు ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కందగట్ల అనంత ప్రకాష్ మాట్లాడుతూ పార్లమెంటు రాష్ట్ర శాసనసభలు మరియు స్థానిక సంస్థలకు ఏకకాలంలో (జమీలి) జరగాలన్న రామ్నాథ్ కోవింద్ కమిటీ సిఫార్సులను కేంద్ర క్యాబినెట్ ఇటీవల ఆమోదించిందని మోడీ ప్రభుత్వ ప్రతిపాదనను ప్రజలందరూ వ్యతిరేకించాలని ఆయన పిలుపునిచ్చారు ఒకే దేశం ఒకే ఎన్నిక అన్నది ఆర్ఎస్ఎస్ బిజెపిల మానస పుత్రిక అని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కందగట్ల అనంత ప్రకాష్ అన్నారు ఒకే నాయకుడు సారధ్యంలో ఉండే ఏకీకృత రాజ్య వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆర్ఎస్ఎస్ బిజెపిలు కోరుకుంటున్నాయని ఇది బిజెపి యొక్క ఫాసిస్టు ఆలోచనలను తెలియజేస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జెమినీ ఎన్నికల వలన చాలా డబ్బు ఆదావుతుందని పదేపదే ఎన్నికల వలన అభివృద్ధి కార్యక్రమాలకు విఘాతం కలిగించడాన్ని నివారిస్తుందన్న పసలేని వాదనలను బిజెపి ముందుకు తీసుకువస్తుందని ఆయన వాపోయారు. జమిలి ఎన్నికలను అమలు జరిగితే రాజ్యాంగం యొక్క రెండు మౌలిక పునాదులైన ప్రజాస్వామ్యం సమాఖ్య విధానాలు దెబ్బతింటాయని తెలిపారు రాజ్యాంగం యొక్క మౌలిక నిర్మాణాన్ని మార్చే అధికారం పార్లమెంటుకు లేదని కేశవానంద భారతి కేసులో సుప్రీంకోర్టు తీర్పునిచ్చిందని ఆయన తెలియజేశారు. పార్లమెంటుకు రాష్ట్ర శాసనసభలో ఎన్నికలు కూడా ఒకేసారి నిర్వహించడం అంటే అది కొన్ని శాసనసభల కాల పరిమితిని కుదించబడేందుకు దారితీస్తుందని ఒక రాష్ట్ర ప్రభుత్వం పడిపోయి శాసనసభ రద్దు చేయాల్సి వస్తే మిగిలిన కాలానికి మాత్రమే మధ్యంతర ఎన్నికలు నిర్వహించబడతాయని ఫలితంగా రాజ్యాంగంలో ప్రజలు ఐదేళ్ల కాలానికి తమ ప్రతినిధులను ఎందుకు పొందుపరచబడిందని జమిలి ఎన్నికల ప్రతిపాదన వల్ల ప్రజల హక్కుల ఉల్లంఘన గురవుతుందని ఇంతేగాక మిగిలిన శాసనసభ కాలానికి మాత్రమే మధ్యంతో ఎన్నిక జరగాలని సిఫార్సు పలుమార్లు ఎన్నికలు జరగకుండా చూడడం కోసమే జమిలి ఎన్నికలని ఆయన అన్నారు పంచాయతీలు మున్సిపాలిటీకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించాలన్న ప్రతిపాదన సమాఖ్య విధానంపై దాడిని మరింత స్పష్టం చేస్తున్నదని ఇది ఒక పగతో కూడిన కేంద్రీకరణ నిర్ణయాలు చేసే అధికారం స్థానిక సంస్థలకు వికేంద్రీకరించాలన్న మౌలిక ఉద్దేశానికి ఇది విరుద్ధమైనదని ఆయన అన్నారు పంచాయతీ మున్సిపల్ ఎన్నికల నిర్వహణ అనేది రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని అంశమని రాష్ట్రాల్లో నెలకొన్న విభిన్న పరిస్థితులు విశాల వైవిధ్యం దీక్ష ఈ ప్రతిపాదన చాలా అసంబద్ధమైనదని ఆయన పేర్కొన్నారు కాబట్టి ఒకే దేశం ఒకే ఎన్నిక మోడీ చేస్తున్న ప్రభుత్వ ప్రతిపాదనను ప్రజలందరూ ముక్తకంఠంతో వ్యతిరేకించాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల నాయకులు దిద్దకుంట్ల పురుషోత్తం రెడ్డి తోరికొండ వెంకటేశ్వర్లు గుడ్డేటి నందయ్య చెన్నయ్య పొలకాని వెంకన్న రామిరెడ్డి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్హెచ్ఆర్సి జిల్లా అధ్యక్షులుగా వడ్డిక అనిల్ రెడ్డి

### నియామక ఉత్తర్వులు అందించిన రాష్ట్ర అధ్యక్షులు



రాజన్న సిరిసిల్ల జిల్లా, అక్టోబర్ 25 (తీన్మార్ న్యూస్): జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్హెచ్ఆర్సి) నేషనల్ చైర్మన్ స్వప్న ఎం. ఆదేశాల మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులుగా జిల్లాలోని ఇల్లంతకుంట మండలానికి చెందిన సామాజిక ఉద్యమకారులు,ఆర్టిఐ కార్యకర్త వడ్డిక అనిల్ రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మొగుళ్ళ భద్రయ్య నియామక ఉత్తర్వులు అందించారు. గతంలో జిల్లా ఇన్చార్జిగా, జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన అనిల్రెడ్డి సేవలను దృష్టిలో ఉంచుకొని జిల్లా అధ్యక్షులుగా నియమించామని రాష్ట్ర ఉపాధ్యక్షులు, న్యాయవాది సుంకనపల్లి రాము తెలిపారు. ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్షులు వడ్డిక అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో ఇచ్చిన ఈ బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని, అవినీతి అక్రమాలకు తావులేని సమాజం కోసం నిజాయితీగా నిస్వార్థం గా సేవ చేస్తానని అన్నారు. జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్ హెచ్ ఆర్ సి) రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు సంస్థ బలోపేతం కోసం జిల్లా వ్యాప్తంగా అన్ని కమిటీలు పూర్తిచేసి పేద ప్రజల పక్షాన సమస్యల పరిష్కారం కోసం ముందుండి కృషి చేస్తామని అన్నారు.తనకు ఈ పదవి రావడానికి కృషి చేసిన జాతీయ, రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రాష్ట్ర కమిటీ సభ్యులు ఓడేటి చంద్రశేఖర్ రెడ్డి, పాక శ్రీనివాస్ యాదవ్, సదన్న, విలాసాగరం పృథ్వీ రాజ్, రాచకొండ కనకయ్య, ఎండి హబీబ్, కరీంనగర్ జిల్లా అధ్యక్షులు ఇమ్మడి ప్రణయ్, సిద్దిపేట జిల్లా అధ్యక్షులు పల్లె రాజు, కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల రాజశేఖర్, కరీంనగర్ టౌన్ అధ్యక్షులు ద్యాగతి హరీష్, హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షులు నరికే ఓదెలు, కరీంనగర్ జిల్లాఅధికార ప్రతినిధి నూనె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

-మారుమూల ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక కృషి
- అర్హులైన నిరుపేదలందరికీ ఇండ్లు ఇవ్వడమే లక్ష్యం
- రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క)



ములుగు జిల్లా, అక్టోబర్ 25 (తీన్మార్ న్యూస్): మారుమూల ప్రాంతాల అభివృద్ధికి, పేదల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి గ్రామీణ నీటి సరఫరా శాఖ, స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. శుక్రవారం వెంకటాపూర్ మండలంలోని జవహర్ నగర్ వద్ద రామాలయం చుట్టూ 5 లక్షల ఎస్ డి ఎఫ్ నిధులతో నిర్మించిన కాంపౌండ్ గోడను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, గ్రంథాలయ చైర్మన్ రవి చందర్ లతొ కలసి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి గ్రామీణ నీటి సరఫరా శాఖ, స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ప్రారంభోత్సవం చేశారు. అనంతరం మాడల్ స్కూల్ ను మంత్రి దనసరి అనసూయ సీతక్క సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి పాఠశాలల్లో విద్యార్థులకు అందుకున్న విద్యను గురించి అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థులకు కుర్చీలు, టేబుల్స్, ఫర్నిచర్ సరిపడలేవని, పిల్లలు ఆటలు ఆడుకోవడానికి గ్రౌండ్ లెవెలింగ్, కాంపౌండ్ వాల్ లేదని ప్రిన్సిపాల్ మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో విద్యావ్యవస్థను పట్టింపు లేక విద్యార్థుల జీవితాలతో ఆడుకున్నారని, మా ప్రభుత్వం విద్య వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత నిస్తుందని అన్నారు. ప్రైవేట్ రంగానికి దిటుగా పాఠశాలలను తీర్చుదిద్దుతున్నామని అన్నారు. ఉపాధ్యాయులు ఓపికగా విద్యార్థులకు అర్థమయ్యే విధంగా విద్యను బోధించాలని సూచించారు. జిల్లాలో అర్హులైన పేదవారందరికి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గత ప్రభుత్వం పేదవాడి గురించి కనీస ఆలోచన చేయలేదని విమర్శించారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందుల ఎదురైనా అభివృద్ధి సంక్షేమాన్ని అడ్డుకోవాలని ప్రయత్నించినా ఏదీ ఆగదని పేదవాడి కన్నీరు తుడవడమే ఈ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ డి ఈ, మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు, పాల్గొన్నారు.

# పంట మార్పిడితో ఆయిల్ పామ్ సాగు పెంచాలి

### జిల్లా ఉద్యాన మరియు పట్టుపరిశ్రమ శాఖ అధికారి



నరసింహులపేట, అక్టోబర్ 25 (తీన్మార్ న్యూస్): శుక్రవారం మహబూబాబాద్ జిల్లా నరసింహులపేట మండలంలోని పలు గ్రామాల్లో రైతుల వరి పొలాల వద్ద కు వెళ్లి వారిని కలిసి, పంట మార్పిడి చేసి ఆయిల్ పామ్ సాగు చేసి ఎకరానికి లక్ష రూపాయలు ఆదాయం పొందాలని విజ్ఞప్తి జిల్లా ఉద్యాన మరియు పట్టుపరిశ్రమ శాఖ అధికారి జీనుగు మరియన్నచేశారు. పలు అవగాహన కార్యక్రమాలు చేపట్టి రైతులు పంట మార్పిడి చేసి ఆయిల్ పామ్, డిమాండ్ ఉన్న ఉద్యాన పంటలు సాగు చేయాలని తెలిపారు. ప్రతి రైతు పొలం గట్ల మీద, పొలం చుట్టూ, పెరట్లో, ఆయిల్ పామ్, పండ్ల తోటలలో అంతర పంటలుగా, డాబాల మీద, ఇంటి ముంగిట రోజువారి అవసరాల నిమిత్తం అన్ని రకాల కూరగాయలను సాగు చేసుకోవాలని, కూరగాయల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు, నూతన రకాల సాగు, ప్రోట్రేస్లలో నారు పెంపకం, ఎత్తు మడులు, మల్చింగ్, బిందు సేద్యం, ఫర్టిగేషన్, వేప పిండి, ఆముదం పిండి వాడకం, వేప నూనె పిచికారి చేయటం, పసుపు రంగు అట్టల వాడకం, సిఫారసు చేసిన ఎరువులు వాడటం, పందిరిపై కూరగాయల సాగు, ట్రెల్లిస్ మెథడ్ లో టమాటా సాగు మొదలైన పద్ధతులు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు రవి, వేముల రామిరెడ్డి, రవి, రేక యాకన్న, వెంకటేష్, వెంకన్న, బానోతు పంతులు, నరేష్, ఉద్యాన అధికారి ఏజే శాంతి ప్రియదర్శిని, టి. జి. ఆయిల్ ఫెడ్ జిల్లా ఇన్చార్జి రాములు, ఫీల్డ్ అధికారులు మమత, వెంకట్, అనిల్ మరియు బిందు సేద్య ప్రతినిదులు అశోక్, ప్రసాద్ బాబు మొదలైన వారు పాల్గొన్నారు.

# ఘనంగా వాసవి క్లబ్ వ్యవస్థాపకులు కేసి గుప్తా వర్ధంతి



నేరేడుచర్ల, అక్టోబర్ 25 (తీన్మార్ న్యూస్): వాసవి క్లబ్ వ్యవస్థాపకులు కల్వకుంట్ల చంద్రసేన గుప్త వర్ధంతి వేడుకలను శుక్రవారం నేరేడుచర్ల వాసవీ మరియు వాసవి వనితా క్లబ్బు ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక రైస్ మిల్లర్స్ అసోసియేషన్ బిల్డింగ్ లో కే.సి గుప్తా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ జోన్ చైర్మన్లు కొత్తా లక్ష్మణ్, వీరవల్లి శ్రీలత లు మాట్లాడుతూ అచంచలమైన ఆత్మవిశ్వాసం, సేవా భావంతో కేసీ గుప్తా స్థాపించిన వాసవి క్లబ్ లు నేడు ప్రపంచ నలుమూలల విస్తరించి నిరుపేదలకు కోట్లాది రూపాయల సేవా కార్యక్రమాలు చేపడుతున్నాయన్నారు. కేసి గుప్తాను ఆదర్శంగా తీసుకొని సేవలు మరింత విస్తరించాలని కోరారు. కార్యక్రమంలో వనితా క్లబ్ అధ్యక్షురాలు గెల్లి లక్ష్మీ ప్రసన్న, వాసవి మరియు వనితా క్లబ్ ల ప్రధాన కార్యదర్శులు జూలూరు అశోక్, చెరుకు కవిత కోశాధికారులు తాళ్లూరి శ్రీనివాస్, గరిణె జ్యోతి , మాజీ అధ్యక్షులు కందిబండ శ్రీనివాస్, ఊటుకూరు నటరాజ్, గరిణె ప్రసాద్, పివిటి, తడకమళ్ళ పరమేశం, చెరుకు రాము, ఉప్పల పుల్లయ్య చెక్కా లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల కళాశాలలో ఇంగ్లీష్ జూ. లెక్చరర్ ఉద్యోగానికి దరఖాస్తుల ఆహ్వానం

జనగామ జిల్లా, అక్టోబర్ 25 (తీన్మార్ న్యూస్): మైనారిటీ గురుకుల బాలికల కళాశాల ఘనపూర్ (స్టేషన్) లో ఔట్సోర్సింగ్ పద్ధతిన జూనియర్ లెక్చరర్ - ఇంగ్లీష్, ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి బి రవీందర్ తెలిపారు. జిల్లాలోని మైనారిటీ రెసిడెన్సియల్ బాలికల కళాశాల ఘనపూర్ (స్టేషన్) లో ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేయుటకు ఖాళీగా ఉన్న జూనియర్ లెక్చరర్ - ఇంగ్లీష్ ఉద్యోగ నియామకానికి అర్హులైన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సంబంధిత ఇంగ్లీష్ సబ్జెక్ట్ లో 50 శాతం మార్కులతో పీజీ పూర్తి చేసి, బిఎడ్ అర్హత కలిగి, 44 సంవత్సరాల వయసులోపు ఉండి, బోధనలో మూడు సంవత్సరాల అనుభవం కలిగినవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. జనగామ జిల్లాకు చెందినవారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని విద్యార్హతలు, నియమ నిబంధనలకు సంబంధించిన వివరాలకు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయములో సంప్రదించాలన్నారు. దరఖాస్తులను ఈ నెల 30వ తేదీ సాయంత్రం 4.30 గంటలలోపు కలెక్టర్ కార్యాలయములోని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయము, రూం నెం. ఎఫ్-25 లో అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు 9951933034, 9059679793, లను సంప్రదించాలన్నారు.

# రైల్వేలో రిటైర్డ్ అయిన వాళ్లకు ఉద్యోగాలు ఇవ్వొద్దు

### స్టేషన్ మేనేజర్ కు డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతి



కాజీపేట, అక్టోబర్ 25 (తీన్మార్ న్యూస్): రైల్వేలో రిటైర్డ్ అయిన ఉద్యోగస్తులకు మళ్లీ ఉద్యోగాలు కల్పించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) హనుమకొండ జిల్లా కార్యదర్శి డి.తిరుపతి, సహాయ కార్యదర్శి ఓ.చిరంజీవి, ప్రజా సంఘ నాయకులు జంపాల రమేష్ కాజీపేట రైల్వేస్టేషన్ లో స్టేషన్ మేనేజర్ కు వినతి పత్రం అందజేశారు. దేశవ్యాప్తంగా రైల్వే రంగంలో వివిధ జోన్ లో ఖాళీగా ఉన్న 25వేల ఉద్యోగాల పోస్టులను భర్తీ చేసేందుకు రైల్వే బోర్డు, 65 ఏళ్ల లోపు వయసు గల రిటైర్ అయిన ఉద్యోగస్తులకు సూపర్ వైజర్స్, ట్రాక్ మేన్ లుగా తీసుకోవాలనుకోవడం, సర్వీసులో చివరిసారి తీసుకున్న జీతంతో సమానంతో పాటు ట్రావెల్స్ అలవెన్స్, అధికారిక టూర్ల ప్రయోజనాలు కల్పించడం, అవసరాన్ని బట్టి పదవి కాలాన్ని పెంచడం నిర్ణయం తీసుకోవడం సరైంది కాదని, దేశంలో చాలామంది నిరుద్యోగులు ఉద్యోగ లేక చాలా ఇబ్బందులు పడుతుంటే, వారికి ఉద్యోగాలు కల్పించాల్సిన ప్రభుత్వం, ఉద్యోగం చేసి రిటైర్డ్ అయిన వాళ్లకు మళ్ళీ ఉద్యోగాలు ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. రైల్వే రంగంలో ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ ఇవ్వని ప్రభుత్వం, ఇప్పటికీ రైల్వేలో రిక్రూట్మెంట్ బ్యాన్ చేసిన బిజెపి ప్రభుత్వం, ఖాళీగా ఉన్న 25వేల ఉద్యోగాలను భర్తీ చేయడం కోసం రిటైర్డ్ వాళ్లకు అవకాశం కల్పించడం అంటే నిరుద్యోగులను మోసం చేసినట్లే అవుతుందని, కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకొని నిరుద్యోగ యువతకు అవకాశం కల్పించి రైల్వేలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ కోసం నోటిఫికేషన్ విడుదల చేయాలని తిరుపతి డిమాండ్ చేశారు.

# అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను పూర్తి చేయండి

### - జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
### - పలు ప్రభుత్వ పాఠశాలల్లో పనుల నాణ్యతను పరిశీలించిన కలెక్టర్



వరంగల్ జిల్లా, అక్టోబర్ 25 (తీన్మార్ న్యూస్): జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. శుక్రవారం వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ ఉర్దూ, తెలుగు మీడియం పాఠశాలల ను, కట్యాల జెడ్పి పీఎస్ పాఠశాలను సంగేమ్ మండలంలోని కొత్తగూడెం, కాపుల కనపర్తి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలను సందర్శించి అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల గుర్తించి చేపట్టిన అభివృద్ధి పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి నాణ్యత తో చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు 645 అభివృద్ధి పనులను గుర్తించి మంజూరు చేయగా అందులో సుమారు 400 పనులను పూర్తయ్యాయని, మిగిలిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. పూర్తయిన పనులకు బిల్లుల చెల్లింపు నిమిత్తం చిత్రాలతో సహా సంబంధిత ఇంజనీర్ తో ధ్రువీకరించి పంపాలన్నారు. ఈ సందర్భంగా కాపుల కనపర్తి పాఠశాలలో విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని కలెక్టర్ పరిశీలించి మెనూ ప్రకారం భోజనం అందియాలని, మధ్యాహ్న భోజనం విద్యార్థులకు సరిపోకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్రధానోపాధ్యాయునికి షో కాజ్ నోటీసు జారీ చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. వర్ధన్నపేట ప్రభుత్వ పాఠశాల పరిసరాల్లో పెరిగిన పిచ్చి చెట్లను తొలగించాలని, నిరుపయోగంగా ఉన్న టాయిలెట్ బ్లాక్ ను వెంటనే మరమ్మతులు చేపట్టి ఉపయోగంలోకి తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖ అధికారి జ్ఞానేశ్వర్, సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

# అత్యంత ఖచ్చితత్వంతో పశుగణన నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా
### పశు గణన వాల్‌పోస్టర్లు ఆవిష్కరించిన కలెక్టర్



వరంగల్ జిల్లా, అక్టోబర్ 25 (తీన్మార్ న్యూస్): జిల్లాలో అత్యంత ఖచ్చితత్వంతో పశు గణాంకాల నమోదు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో పశు గణన వాల్‌పోస్టర్ ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నేటి నుంచి నాలుగు నెలల పాటు (28 ఫిబ్రవరి 2025 వరకు) 21వ జాతీయ పశు గణన ప్రక్రియ చేపట్టడం జరుగుతున్నదని, ఇందుకోసం. జిల్లాలో 58 మంది పశుగణనకర్తలు, 24 మంది పర్యవేక్షకులను నియమించినట్లు తెలిపారు. జిల్లాలోని 13 మండలాలు 161 రెవెన్యూ గ్రామాల్లో, 70 మునిసిపల్ వార్డు/ పట్టణ ప్రాంతాల్లో పశు గణన జరుగుతుందన్నారు. జిల్లాలోని 1,24,603 మంది రూరల్, 117,982 మంది కార్పొరేషన్, 17,936 మంది మునిసిపాలిటీ లలోని కుటుంబాలను సర్వేచేసి గేదెలు, ఆవులు, కోళ్లు, గొర్రెలు, మేకలు ఇలా 16 రకాల పశువులు, జీవాల సంఖ్యను లెక్కించి, యాప్‌లో నమోదు చేయనున్నట్లు వివరించారు. పశు గణన ఆధారంగా నిధులతో పాటు వ్యాధినిరోధక టీకాలు, నట్టల వ్యాధి నివారణ మందులు వంటివి సరఫరా అవుతాయని ఈ నేపథ్యంలో ప్రజలు,రైతులు గణనకర్తలకు సహకరిస్తూ కచ్చితమైన వివరాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ బాలకృష్ణ, జిల్లా నోడల్ అధికారి బాలాజీ, పశు వైద్యాధికారులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు

### - హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య
### - ఘనంగా అండర్ 19 జూనియర్ క్రీడా పోటీలు ప్రారంభం





హనుమకొండ జిల్లా, అక్టోబర్ 25 (తీన్మార్ న్యూస్): క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. శుక్రవారం హనుమకొండ జె.ఎన్.ఎస్. స్టేడియంలో అండర్ 19 జూనియర్ కళాశాలల క్రీడా పోటీలు ఘనంగా నిర్వహించారు. డివైఎస్ఓ గుగులోతు అశోక్ కుమార్ అధ్యక్షతన జరిగిన పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు సంపాదించవచ్చు అని తెలిపారు. జిల్లాలోని పాఠశాలలో, కళాశాలలో క్రీడల్లో రాణించడం వల్ల లాభాలపై బోర్డు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఉమ్మడి జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు అజీజ్ ఖాన్ మాట్లాడుతూ క్రీడల్లో రాణించడం వల్ల నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని, అలాగే స్నేహపూర్వక వాతావరణం క్రీడల్లో పాల్గొనాలని విద్యార్థులకు సూచించారు. పోటీల ఆర్గనైజింగ్ సెక్రెటరీ, డివైఎస్ఓ గుగులోతు అశోక్ కుమార్ మాట్లాడుతూ ఈనెల 29వ తేదీ వరకు ఉమ్మడి జిల్లా స్థాయి అండర్ 19 జూనియర్ కళాశాలల క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని అందులో రేపు నిర్వహించబోయే క్రీడాంశాలు 1. కోకో, 2.టైక్వాండో,3.బాక్సింగ్, 4.చెస్, 5.జిమ్నాస్టిక్స్, 6.హాకీ, 7.వెయిట్ లిఫ్టింగ్, 8.ఆర్చరీ, 9.ఫెన్సింగ్ 10.అథ్లెటిక్స్ మొదలగు క్రీడలు జవహర్లాల్ నెహ్రూ స్టేడియం నందు నిర్వహించ బడునని ఎంపికలలో పాల్గొనే క్రీడాకారులు తప్పనిసరిగా ఆధార్ కార్డు, లేటెస్ట్ బోనఫైడ్, ఎస్.ఎస్.సి మెమో జిరాక్స్ ల పై తప్పనిసరిగా కాలేజ్ ప్రిన్సిపల్ సంతకం చేయించుకొని ఉదయం 8 గంటలకు జవహర్ లాల్ నెహ్రూ స్టేడియం నందు హాజరుకావాలని సూచించారు. గమనిక: జూడో క్రీడాంశము ఓ సిటీ స్టేడియం నందు నిర్వహించబడును. కావున క్రీడాకారులు రేపు ఉదయం ఉదయం 8 గంటలకు ఓ సిటీ స్టేడియం నందు లింగమూర్తి జూడో కోచ్ ను సంప్రదించగలరని సూచించారు. రాష్ట్ర, జాతీయ స్థాయి జూనియర్ కళాశాల క్రీడా పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానం సాధించిన క్రీడాకారులకు కలెక్టర్ చేతుల మీదగా బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ వరంగల్ డి ఐ ఈ ఓ గోపాల్ రావు డాక్టర్ శ్రీధర్, వెంకట్ రెడ్డి, దస్రు నాయక్, బరపాటి గోపి, సతీష్, ప్రభాకర్ రెడ్డి, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

# మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం

### -మహిళా సంఘాలకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తూ అండగా నిలుస్తుంది
### - పార్టీలకు అతీతంగా జిల్లాను అభివృద్ధి చేసుకుందాం





గోవిందరావుపేట, అక్టోబర్ 25 (తీన్మార్ న్యూస్): మహిళలను కోటీశ్వరులుగా మార్చడానికి మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందించడంతో పాటు మహిళలు 17 రకాల వ్యాపారాలు చేసుకోవడానికి ప్రభుత్వం రుణాలను మంజూరు చేస్తున్నదని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. శుక్రవారం గోవిందరావుపేట మండలం, చాల్వాయి ఆదర్శ పాఠశాల లో కంప్యూటర్ ల్యాబ్, (సి ఎస్ ఆర్ నిధులు మౌరిటెక్ ఐటి సంస్థ సౌజన్యం) 10 కంప్యూటర్లతొ జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, గ్రంథాలయ చైర్మన్ రవి చందర్ లతొ కలసి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి గ్రామీణ నీటి సరఫరా శాఖ, స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ప్రారంభించారు. అనంతరం చాల్వాయిలోని ట్రైనింగ్ సెంటర్లో ఎస్హెచ్జి మహిళలకు ఉష ఇంటర్నేషనల్ లిమిటెడ్ కంపెనీ సౌజన్యంతో కుట్టు మిషన్ 25 రోజుల శిక్షణ, ఉత్పత్తి కేంద్రంను మంత్రి దనసరి అనసూయ సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నో రోజులుగా టీచర్ల యొక్క సమస్యలు పెండింగ్లో ఉంటే సీఎం ప్రత్యేక దృష్టి పెట్టి ప్రమోషన్ ఇచ్చి, ట్రాన్స్ఫర్స్ చేయడం జరిగిందని అన్నారు. 60 రోజులలో నోటిఫికేషన్ ఇచ్చి దాదాపుగా 11,000 మందికి టీచరు ఉద్యోగాలు ఇచ్చినటువంటి ఘనత కూడా ఈనాటి ప్రభుత్వానిదే అన్నారు. ప్రధాని మన్మోహన్ సింగ్ గారి ఆలోచనతో మోడల్ స్కూల్స్ ఏర్పాటు చేయడం జరిగిందనీ అన్నారు. ఆధునికమైనటువంటి విద్య, కంప్యూటర్ విద్య అందాలానే ఉద్దేశం తో పెద్ద పెద్ద కార్పొరేట్ కంపెనీలను ములుగు జిల్లా పిలువడం జారుతుందని అన్నారు. ములుగు అంటే వెనుకబడ్డ జిల్లా అని మనం చెప్పుకుంటున్నాము. కచ్చితంగా జిల్లాను ప్రగతిపథంలో ముందుకు తీసుకురావాలని అన్నారు.మానసిక ఉత్సాహం, ఉల్లాసం ధైర్యం, గౌరవించే మనస్తత్వం కూడా నేర్చుకో వాలని అన్నారు. పేదల పట్ల ప్రేమ కరుణ ఉండాలనీ ఆన్నారు. ప్రతి గ్రూపుకు రెండు లక్షల నుంచి 20 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు ఇవ్వడం జరుగుతుందనీ ఆన్నారు. ప్రభుత్వం వడ్డీ లేని రుణాలను తీసుకుంటున్న మహిళలు సకాలంలో అప్పు చెల్లించాలని, తిరిగి పెద్ద మొత్తంలో అప్పు కోరిన మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. మహిళలు బాగుంటేనే గ్రామాలు సమాజం బాగుంటుందని అభిప్రాయపడ్డారు. పేదరిక నిర్మూలననే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు పోతున్నదని, ప్రభుత్వ కల్పిస్తున్న అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకొని ముందుకు సాగాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మంచిగా చదువుకొని పోటీ తత్వంలో ముందుకు వెళ్లాలని అన్నారు. మీరు మంచిగా చదువుకోని మీ తల్లి తండ్రులకు మంచి పేరు తీసుకొని రావాలని విద్యార్థు లకు హితవు పలికారు. ప్రతి విద్యార్థి ఈ సంవత్సరం మెరిట్ మార్కులు సాధించేలా ఉపాధ్యాయులు చొరవ చూపాలన్నారు. స్కూల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అంకితభావం, కష్టపడే మనస్తత్వం ఉంటే ఏ రంగంలోనైనా రాణించవచ్చని అన్నారు. జీవితంలో ఎవరిపై ఆధారపడకుండా స్వశక్తితో జీవించాలని, అయితే ఏ రంగంలోనైనా పోటీ సాధారణమని, ప్రత్యేకించి గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా వ్యాపార రంగంలో స్థిరపడాలనుకుని శిక్షణ పొందిన మహిళ అభ్యర్థులు అంకితభావంతో, కష్టపడి పని చేస్తే తప్పనిసరిగా రాణిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఇంచార్జ్ సంపత్ రావు, ఉషా కంపనీ డిప్యూటీ మేనేజర్ రాజ్ కుమార్, ఏపీడి, తహసిల్దార్, ఎంపీడీవో, ఏటీఎంలో, వివో లు, సిపలు, మహిళా సంఘ సభ్యులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు చదువుపై ఆసక్తి పెంపొందించుకోవాలి



జనగామ జిల్లా, అక్టోబర్ 25 (తీన్మార్ న్యూస్): విద్యార్థులు చదువుపై ఆసక్తి పెంపొందించుకునేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ నర్మెట్ట మండలంలో పర్యటించి కేజీబీవీ తరగతి గదులను, మోడల్ హై స్కూల్ భోజనశాల ను సందర్శించి నిర్వహణ తీరును పర్యవేక్షించారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేజీబీవీ విద్యార్థులకు కావలసిన అదనపు గదులు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. మౌలిక వసతుల కల్పనలో అధికారులు పర్యవేక్షణలు చేపట్టాలని చర్యలు తీసుకోవాలన్నారు. 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ 100 శాంతం ఫలితాలు సాధించాలని, విద్యార్థులు విద్యపై ఆసక్తి పెంపొందించుకొని ఇష్టతతో చదవాలని 10 / 10 సాధించాలని జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తూ, విద్యార్థుల హాజరు శాతం పెంచాలని ఉత్తమ ఫలితాలు రాబట్టాలని అధికారులకు సూచించారు. కావలసిన అదనపు వసతుల కొరకు ప్రతిపాదనలు అందించాలన్నారు. మోడల్ స్కూల్లో వంటగదిని సందర్శించి ఆహార వస్తువులను పరిశీలించారు. అనంతరం తాసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ధరణి, మీ సేవ పెండింగ్ దరఖాస్తులను రిజిస్టర్ ల ద్వారా పరిశీలించారు. ఎల్ఆర్ఎస్ క్రింద అందించిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. కలెక్టర్ వెంట విద్యాశాఖ అధికారి రాము, మండల విద్యాశాఖ అధికారి అయిలయ్య, నర్మెట్ట తాసిల్దార్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా న్యాయ సేవా కార్యదర్శిని కలిసిన మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ అధికారులు

హనుమకొండ జిల్లా, అక్టోబర్ 25 (తీన్మార్ న్యూస్): హనుమకొండ జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన క్షమాదేశ్ పాండేను శుక్రవారం రోజున జిల్లా సంక్షేమ అధికారి జె జయంతి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ అన్నమనేని అనిల్ చందర్ రావులు కలిసి శుభాకాంక్షలు తెలియచేసారు. అనంతరం జిల్లా సంక్షేమ అధికారి జయంతి మహిళలు పిల్లలు, దివ్యాంగులు మరియు వయో వృద్ధులకు అందిస్తున్న సేవల గురించి వివరించారు. రక్షణ సంరక్షణ అవసరం ఆన్న బాల బాలికలకు అందిస్తున్న పునరావాస చర్యల గురించి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ అనిల్ చందర్ వివరించారు.ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్ పాండే మాట్లాడుతూ త్వరలో అన్ని విభాగాల అధికారులు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేస్తానని తదనంతరం గ్రామ, మండల, జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసి మహిళలు,బాలల చట్టాలపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శిని కలిసిన వారిలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు డాక్టర్ పరికి సుధాకర్,జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఇన్చార్జి అధికారి ఎస్ ప్రవీణ్ కుమార్, సఖి వన్ స్టాప్ సెంటర్ అడ్మిన్ పి హైమావతి,లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి తదితరులు ఉన్నారు

# అంగన్వాడి, ప్రాథమిక పాఠశాలలు, వసతి గృహాలు తనిఖీ



నెల్లికుదురు, అక్టోబర్ 25 (తీన్మార్ న్యూస్): మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురుమండల కేంద్రములోని తెలంగాణ మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ స్కూల్ మరియు ఎర్రబెల్లిగూడెం అంగన్వాడి స్కూల్స్, ప్రాథమికోన్నత పాఠశాలలను జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ఆదేశాల మేరకు మండల ప్రత్యేక అధికారి, జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమశాఖ అధికారి జినుగు మరియన్న తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మెరుగైన ఫలితాలు కోసం నిరంతరం మంచి విద్యను అందించాలని టీచర్లుకు సూచించారు.చుట్టూ పరిసరాలు పరిశుభ్రతని నిర్వహించాలని, వేడి వేడి భోజనం విద్యార్థులకు అందిం చాలని, విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేయాలని అన్నారు.

# అభివృద్ధిలో పనులలో దూసుకుపోతున్న జవహర్ నగర్



### జవహర్ నగర్ మేయర్ శాంతి

జవహర్ నగర్, అక్టోబర్ 25 (తీన్మార్ న్యూస్): ప్రగతి పనులతో జవహర్ నగర్ నూతన శోభ సంతరించుకుందని, పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మేయర్ శాంతి అన్నారు. జవహర్నగర్ కార్పొరేషన్ 19వ డివిజన్ కార్పొరేటర్ మేక లలితాయాదవ్ ఆధ్వర్యంలో రాజీవ్‌గంధీనగర్లో 15వ ఫైనాన్స్ నిధులు రూ. 10లక్షలతో శుక్రవారం స్మశానవాటిక ప్రహరీ గోడ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, కార్పొరేటర్లు గొడుగు వేణు, కుతాడి సాయి, నాయకులు వినోద్, కుమారస్వామి, కాలనీవాసులు పాల్గొన్నారు.

# ఆరోగ్య సేవలో ఆశాలది ప్రత్యేక స్థానం

## నాయిని రాజేందర్రెడ్డి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే



హనుమకొండ, అక్టోబర్ 25 (తీన్మార్ న్యూస్): ఆశా కార్యకర్తలు అందిస్తున్న సేవలు చిరస్మరణీయమని కోవిడ్ సమయంలో ఏఎన్ఎంలు, ఆశాలు అందించిన సేవలు మరువలేనివని వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఐఎంఏ హాల్ వరంగల్ లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆశా కార్యకర్తలకు రిజిస్టర్లను పంపిణీ చేశారు. ఏఎన్ఎంలు, ఆశాలు పని ఒత్తిడిని ప్రభుత్వం గుర్తించిందని ప్రజా ఆరోగ్యం కోసం పనిచేసే వారికి తాము ఎప్పుడు అండగా ఉంటామని ఇంకా బాధ్యతతో సమిష్టిగా పని చేస్తూ జిల్లా అభివృద్ధిలో పాలుపంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో ఏడు పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ఒక కుటుంబ సంక్షేమ కేంద్ర పరిధిలో 99 మంది ఆశా కార్యకర్తలు పనిచేస్తున్నారని పని భారం ఉన్నప్పటికీ అన్నివేళలా ప్రజలకు అండగా ఉంటున్నారని అభినందించారు. ప్రజా ప్రభుత్వంలో, ప్రజారోగ్యంలో పనిచేసే వారికే ప్రత్యేక గుర్తింపు సముచిత స్థానాన్ని కల్పిస్తామన్నారు. ఎంతో గౌరవం ఉన్న ఏఎన్ఎంలు, ఆశాలు బాధ్యతయుతంగా పనిచేయాలని జీతాలు విషయంలో ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని, అలాగే ముఖ్యమంత్రి ప్రకటించబోతున్న ఇందిరమ్మ ఇళ్లలో అర్హులైన ఏఎన్ఎంలు, ఆశాలకు అవకాశం కల్పిస్తామన్నారు. శ్రీమతి మైముద తమ సమస్యలను, పని భారాన్ని ఎమ్మెల్యేకి వివరించి వారిని సన్మానించి కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్, డాక్టర్ కే లలితాదేవి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, డాక్టర్ ఇఫ్తాకర్ అహ్మద్ ప్రోగ్రాం అధికారి ఎన్ సి డి, డాక్టర్ నాగరాజు ప్రోగ్రాం అధికారి ఎం సి హెచ్, శ్రీ వి అశోక్ రెడ్డి డిఈఎం%శీ%, ఎల్ చంద్రశేఖర్ హెచ్ఈఈఓ, పట్టణ ఆరోగ్య కేంద్ర ఆశాలు మరియు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇక స్పామ్ కాల్స్ కు చెక్...

న్యూఢిల్లీ: భారతీయ ఫోన్ నంబర్‌లకు వచ్చే అంతర్జాతీయ కాల్‌లను గుర్తించి బ్లాక్ చేయడానికి కొత్త స్పామ్ ట్రాకింగ్ సిస్టమ్‌ను ప్రభుత్వం ప్రకటించింది. సిస్టమ్ యాక్టివేట్ చేసింది. యాక్టివేషన్ అయిన 24 గంటలలోపే దాదాపు 1.35 కోట్లు లేదా భారతీయ ఫోన్ నంబర్‌లకు వచ్చిన మొత్తం అంతర్జాతీయ కాల్‌లలో 90 శాతం స్పామ్ కాల్స్‌ను గుర్తించారు. దీని తరువాత వారు టెలికాం సర్వీస్ ప్రొవైడర్స్ ద్వారా భారతీయ టెలికాం వినియోగదారులకు చేరుకోకుండా నిరోధించింది. 'ఇంటర్నేషనల్ ఇన్‌కమింగ్ స్పావ్డ్ కాల్స్ ప్రివెన్షన్ సిస్టమ్'ను ప్రారంభించిన కేంద్ర సమాచార శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా మాట్లాడుతూ.. సురక్షితమైన డిజిటల్ టెక్నాలజీని సృష్టించడం, సైబర్ నేరాల నుండి ప్రజలను రక్షించడం కోసం ప్రభుత్వం చేస్తున్న మరో ప్రయత్నం ఇది అని అన్నారు. ఈ వ్యవస్థ అమలుతో భారతీయ టెలికాం వినియోగదారులు +91 నంబర్ నుండి ఇటువంటి నకిలీ కాల్‌లలో గణనీయమైన తగ్గింపును చూస్తారని అన్నారు. సైబర్ నేరగాళ్లు భారతీయ మొబైల్ నంబర్ (+91)ను వాడుతూ అంతర్జాతీయ నకిలీ కాల్‌లు చేస్తూ నేరాలకు పాల్పడుతున్నారు. ఈ కాల్‌లు భారతదేశంలో నుండి వస్తున్నట్లు కనిపిస్తున్నాయి. కానీ వాస్తవానికి కాలింగ్ లైన్ ఐడెంటిటీ లేదా సాధారణంగా ఫోన్ నంబర్ అని పిలవబడే వాటిని మార్చడం ద్వారా విదేశాల నుండి చేస్తున్నారని మంత్రి అన్నారు. నేరగాళ్లు +91 కోడ్ వచ్చేలా విదేశాల నుంచి స్పామ్ కాల్స్ చేస్తున్నారని గుర్తించినట్లు ఆయన వెల్లడించారు. ఈ నకిలీ కాల్‌లు ఆర్థిక మోసాలకు, ప్రభుత్వ అధికారులను అనుకరిస్తూ భయాందోళనలకు గురిచేస్తున్నారని, ఫోన్‌లో మాట్లాడుతూనే వినియోగదారుల పూర్తి వివరాలు తెలుసుకుని మోసాలకు పాల్పడుతున్నారన్నారు. సైబర్ క్రైమ్ కేసులు కూడా ఆనీ/ ఖీంఎ అధికారులు మొబైల్ నంబర్‌లను బ్లాక్ చేస్తామని బెదిరించడం, నకిలీ డిజిటల్ అరెస్ట్‌లు, కొరియర్‌లలో డ్రగ్స్/నార్కోటిక్స్, పోలీసు అధికారులను అనుకరిస్తూ మోసం చేయడం, సెక్స్ రాకెట్‌లో అరెస్ట్ చేయడం మొదలైన కేసులు కూడా వెలుగులోకి వచ్చాయన్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ కమ్యూనికేషన్స్ (ఆూ), టెలికాం సర్వీస్ ప్రొవైడర్‌లు సంయుక్తంగా ఒక వ్యవస్థను అభివృద్ధి చేశాయని, దీని కింద ఇటువంటి మోసపూరిత అంతర్జాతీయ కాల్‌లు గుర్తిస్తున్నారు. భారతీయ టెలికాం వినియోగదారులకు చేరకుండా నిరోధిస్తున్నట్లు చెప్పారు. మోసగాళ్లు ఇతర మార్గాల ద్వారా కూడా మోసాలకు పాల్పడే అవకాశం ఉందని, అలాంటి కాల్‌ల కోసం సంచార్ సాథీలోని చక్షు ఫీచర్‌లో ఇటువంటి అనుమానిత మోసపూరిత కమ్యూనికేషన్‌లను నివేదించడం ద్వారా మీరు సహాయం చేయవచ్చు అని ప్రభుత్వం పేర్కొంది. సైబర్ మోసం నుండి ప్రజలను రక్షించడానికి టెలికమ్యూనికేషన్స్ విభాగం తీసుకున్న మరో అడుగు ఇది. సిస్టమ్ ఇన్‌కమింగ్ అంతర్జాతీయ కాల్‌లను గుర్తించి బ్లాక్ చేస్తుంది.

# నూతన ఎస్సైని శాలువాతో సన్మానించిన : జర్నలిస్టులు




వనపర్తి జిల్లా, అక్టోబర్ 25 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా పెద్దమందడి మండల పోలీస్ కేంద్రంలో,గత కొన్ని నెలల క్రితం సబ్ ఇన్స్పెక్టర్ గా ఏస్.ఐ బి.హరి ప్రసాద్ విధులు నిర్వహించి, కొద్దిరోజుల వ్యావధిలో గోపాల్ పేట మండలంలో విధులు నిర్వహించారు. అనంతరం నూతనంగా వనపర్తి పట్టణ టౌన్ ఎస్సైగా బాధ్యతలు చేపట్టడంతో, పెద్దమందడి మండల విలేకరులు ఎస్సై హరిప్రసాద్ గారిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం విలేకరులు మాట్లాడుతూ, పెద్దమందడి మండలంలో విధులు నిర్వహించేటప్పుడు మండల పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలతో మరియు విలేకరులతో స్నేహపూర్వకంగా కలిసి మెలిసి ఉండేవారని విధి నిర్వహణలో ఇలాంటి వారి కైనా చట్ట ప్రకారంగా న్యాయం చేకూర్చేవారని అన్నారు. ఈ క్రమం లో ఎస్సై హరిప్రసాద్ మాట్లాడుతూ ప్రజల కు న్యాయం చేకూర్చటానికి పోలీస్ స్టేషన్ తలుపులు ఎప్పుడు ఎదురు చూస్తూనే ఉంటాయని, అన్యాయాలకు అక్రమాలకు పాల్పడిన వారికి చట్ట ప్రకారంగా శిక్ష విధిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో విలేకరులు. వనపర్తి జిల్లా బ్యూరో ప్రజా దర్బార్ వెంకట్ గౌడ్, వార్త తరంగాలు పత్రిక అశోక్ కుమార్, వి5 యూట్యూబ్ ఛానల్ బండి రాజు, వనపర్తి బ్యూరో పొలిటికల్ పవర్ పత్రిక బాజా శేఖర్, వనపర్తి నియోజకవర్గం ప్రతినిధి ఎన్.కృష్ణ యాదవ్. లు పాల్గొన్నారు.

# హైడ్రా నోటీసులతో బిజీ...

హైదరాబాద్: హైడ్రా స్పీడ్ తగ్గిందా? లేక తెర వెనుక పని చేసుకుంటూ పోతోందా? రెండు వారాలుగా హైదరాబాద్‌లో హైడ్రా ఎందుకు సైలెంట్ అయ్యింది? నగరంలో అక్రమ కట్టడాల మాటేంటి? ఇలా రకరకాల ప్రశ్నలు చాలా మందిని వెంటాడుతున్నాయి.తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తీసుకొచ్చింది హైడ్రా వ్యవస్థ. హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానటరింగ్ అండ్ ప్రొటెక్షన్ ఏజెన్సీ పేరుతో వచ్చింది. మొదట్లో యమ దూకుడు ప్రదర్శించింది. ఆ తర్వాత మెల్ల మెల్లగా సైలెంట్ అయిపోయింది. ఇందుకు కారణమేంటి?హైడ్రా తన చర్యలను వేగవంతం చేస్తోంది. ఇప్పటివరకు కూల్చిన వ్యర్థాలను తొలగించిన నిర్మాణదారుణలకు నోటీసులు ఇచ్చింది. రెండు నెలల కిందట అంటే ఆగస్టు 14న నిజాంపేట్ ఎర్రకుంట చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మించిన ఐదు అంతస్తుల భవనాలను మూడింటిని నేల కూల్చింది. హైడ్రా తన పని తాను చేసుకుపోయింది.వ్యర్థాల్లో ఉన్న ఐరన్‌ను తీసుకెళ్లారు. వ్యర్థాలను అక్కడే వదిలేసి సైలెంట్ అయ్యారు నిర్మాణదారులైన బిల్డర్లు. ఈ వ్యవహారంపై హైడ్రా దృష్టి పెట్టింది. కూల్చిన వ్యర్థాలను తొలగించాలంటూ నోటీసులు జారీ చేసింది. ప్రస్తుతం ఎర్రకుంట చెరువులో ఉన్న వ్యర్థాలను తొలగిస్తోంది హైడ్రా. దీంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.మరోవైపు నాలాలపై హైడ్రా దృష్టి పెట్టినట్టు తెలుస్తోంది. రీసెంట్‌గా సిటీలో వర్షం పడినప్పుడు పలు ప్రాంతాలను పరిశీలించారు హైడ్రా కమిషనర్ రంగనాథ్. నాలాలను పరిశీలించారు.. వాటిలో చాలా వరకు చెత్త చెదారంతో మూసుకుపోయాయి. దానిపై అక్రమ షాపులు వెలిశాయి.అలాగే ట్రాఫిక్ జామ్ అవుతున్న ఏరియాల్లో ఫుట్‌పాత్‌లపై ఫోకస్ చేసినట్టు తెలుస్తోంది. నాలాలపై ఉన్న అక్రమ నిర్మాణాలు తొలగించి, అక్రమ కట్టడాలు అడ్డుకోగలిగితే ఎలాంటి వరదలు వచ్చినా కొంతలో కొంత హైదరాబాద్ సేఫ్ అవుతుందని అంటున్నారు మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టును రేవంత్ సర్కార్ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఈ ప్రాజెక్టును రెండు దశల్లో పూర్తి చేయాలన్నది ఆలోచన. మొదటి దశ పనులు మొదలుపెట్టిన కొద్దిరోజులకే రెండో దశ కార్యాచరణ మొదలుపెట్టాలని భావిస్తోంది. మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుపై చకచకా అడుగులు వేస్తోంది కాంగ్రెస్ ప్రభుత్వం. మూసీ నదీ గర్భంలో 1600 ఇళ్లు, బఫర్ జోన్‌లో 13 వేళ ఇళ్లు ఉన్నట్లు అధికారులు గుర్తిం చారు. అయితే బాధిత కుటుంబాలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లతోపాటు పరిహారం కిందట 25 వేల రూపాయలను ఇచ్చింది ప్రభుత్వం. అంతేకాదు ఉపాది కోసం 2 లక్షల లోన్లను ప్రభుత్వం అందజేస్తున్న విషయం తెల్సిందే. ఇదికాకుండా ఇంటి స్థలం ఇవ్వాలనే ఆలోచనలో ఉన్నట్లు ప్రభుత్వ వర్గాల ఆలోచన. ఔటర్ రింగ్ రోడ్డు నాలుగు వైపులా ఇళ్ల స్థలాలను ఇవ్వాలని భావిస్తోంది. దీనిపై ఈనెల 26న జరగనున్న కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకునే అవకాశముంది. కుటుంబానికి 150 నుంచి 200 గజాల చొప్పున ప్లాన్ ఇవ్వాలని భావిస్తోంది. మార్కెట్లో ఆ స్థలం విలువ అక్షరాలా 25 లక్షల పైమాటేనని అధికారులు అంటున్నారు. వీటి కోసం 600 ఎకరాలు అవసరమని అంచనా వేస్తోంది. ఒకవిధంగా చెప్పుకోవాలంటే మూసీ నిర్వాసితులకు ఇదొక బంపరాఫర్ అన్నమాట. హైదరాబాద్ చుట్టు పక్కల చాలా చోట్ల ప్రభుత్వ భూములున్నాయి. అందులో ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించుకున్నవి ఉన్నాయి. ఆయా భూములనే ఇళ్ల స్థలాలుగా ఇవ్వాలన్నది ప్రభుత్వ ఆలోచనగా అధికారులు చెబుతున్నారు. మొదటి దశ పనులు మొదలుపెట్టిన కొద్దిరోజులకే రెండో దశ కార్యాచరణ మొదలు పెట్టాలని భావిస్తోంది. తొలి దశలో మూసీకి ఇరువైపులా రిటెయినింగ్ వాల్ నిర్మించాలనే యోచనలో ఉంది. వాల్ మధ్యలో ఉన్న మూసీ నదిని శుద్ధి చేసి అటూ సుందరీకరణ చేయాలన్నది ప్రభుత్వ ఆలోచన. బఫర్ జోన్‌లో మూసీ నది వెంబడి 55 కిలోమీటర్ల మేరా రెండు వైపులా రోడ్లను నిర్మించనుంది. అటు ఇటూ అభివృద్ధి కార్యక్రమాలు చేపడతారు.

# సంత స్థలం ఆక్రమణపై పట్టణ ప్రజల ధర్నా

- భయబ్రాంతులకు గురైన పెబ్బేరు ప్రజలు
- దేవుడు భూమి దేవుడికి చెందాలని డిమాండ్

పెబ్బేరు, అక్టోబర్ 25 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా పెబ్బేరులో శ్రీ వేణుగోపాల స్వామి ఆలయానికి చెందిన సంత భూమిలో, పట్టాదారులు కాకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారి మాజీ మంత్రి ముఖ్య అనుచరుడు అయిన, నీలం గౌడ్ తన బలగంతో సంత స్థలానికి హద్దులు ఏర్పాటు చేయాలని చూడగా, పెబ్బేరు ప్రజలు, సంత కాంట్రాక్టర్లు, పరిరక్షణ సమితి సభ్యులు మూకుమ్మడిగా అడ్డుకున్నారు. నీలం గౌడ్ అనే రియల్ వ్యాపారి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అండదండలతో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంలో సంత స్థలాన్ని ఆక్రమించుకున్న విషయం అందరికీ తెలిసిన విషయమే. ఆ సంత కోసం పెబ్బేరు పట్టణ ప్రజలు ఎన్నో రోజులుగా ధర్నాలు చేస్తున్నారు. ఆ సంత వల్ల పలు జిల్లాలోని ప్రజలు ఇతర రాష్ట్రాల ప్రజలు ప్రయోజనాలు పొందుతున్నారని, ఆ సంత వల్లే పెబ్బేరు పట్టణ ప్రజల జీవనాధారం ఉన్నదని, పట్టణ ప్రజలు వాపోతున్నారు. ఆ సంత విషయంపై గతంలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అండదండలు ఉన్నాయని పెబ్బేరు పట్టణ ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పారు. సంత స్థలం తనదంటూ కొందరు గూండాలను తన వెంట తెచ్చుకొని శుక్రవారం ఉదయం 6.30 గంటల ప్రాంతంలో దర్జాగా హద్దులు పాతేందుకు సిద్ధమ్యారు. జేసీబీలు, హిటాచీలు, టిప్పర్లు తెచ్చుకున్నారు. సంత బాటకు ఒక పక్కన కంకరను పోశారు. ఇదంతా గమనించిన ఆలయ పరిరక్షణ సమితి సభ్యులు, కాంట్రాక్టర్లు, వివిధ పార్టీల నాయకులు అక్కడికి చేరుకొని ఆ పనులను అడ్డుకున్నారు. దీంతో ఆగ్రహించిన రియల్ వ్యాపారి తన మనుషులతో అడ్డుకోవడానికి వచ్చిన వారిపై ఉసిగొలపడంతో కొంతసేపు ఘర్షణ వాతావరణం నెలకొంది. రాళ్లతో దాడి చేశారు. గొడవ పెద్దదవుతుందని గ్రహించిన రియల్ వ్యాపారి అక్కడి నుంచి తన వాహనంలో పత్తా లేకుండా వెళ్లిపోయాడు. అక్కడి నుంచి పెబ్బేరు సుభాష్ చౌరస్తాకు వచ్చి రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. అనంతరం పెబ్బేరు ప్రజలు, సంత కాంట్రాక్టర్లు, పరిరక్షణ సమితి సభ్యులు పెబ్బేరు పీఎస్లో కంప్లైంట్ ఇచ్చారు. దేవుడి భూమి దేవుడికే చెందాలని, ఇతరులు వచ్చి దానిని కబ్జా చేయకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉందని అన్నారు. రియల్ వ్యాపారిపై చర్యలు తీసుకోవాలని, సంత స్థలానికి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.



# మహిళా సమాఖ్య భూ కొను'గోల్‌మాల్'

- ఆడిట్‌లో బహిర్గతం.. అధికారుల పాత్ర
- దళారుల జోక్యంతో దారిమళ్లిన రూ.1.50 కోట్లు
- జనగామ కలెక్టర్‌కు సభ్యుల ఫిర్యాదు



వరంగల్: జనగామ జిల్లా మహిళా సమాఖ్య జిల్లా కార్యాలయం కోసం కొనుగోలు చేసిన భూమి వ్యవహారంలో నిధులు భారీగా చేతులు మారినట్టు తెలిసింది. వ్యవసాయానికి పనికిరాని భూమిని రూ.2.35 కోట్లతో కొనుగోలు చేయడంపై ఆరోపణలు వస్తున్నాయి. పట్టణ పేదరిక నిర్మూలన పథకం(ఎస్ఈఆర్‌పీ) నుంచి ఇచ్చే సామాజిక అభివృద్ధి నిధులు (సోషల్ డెవలప్‌మెంట్ ఫండ్) తోపాటు ధాన్యం కొనుగోలు ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే 10 శాతం తదితర నిధులను భూ దందాకు వినియోగించినట్టు సమాచారం. వాస్తవంగా ఈ నిధులను గ్రామ సమాఖ్య సభ్యులకు, మండల సమాఖ్య సభ్యుల ఆర్దికాభివృద్ధికి వినియోగించాల్సి ఉంది. ఇందుకు భిన్నంగా సమావేశం లో చర్చ పెట్టకుండా, ఎలాంటి తీర్మానమూ చేయకుండా నిర్ణయం తీసుకోవడం వెనుక సమాఖ్య బాధ్యులతోపాటు డీపీఎం, పలువురు దళారుల ప్రమేయం ఉందని ప్రచారం జరుగుతోంది. జనగామ మండలం వెంకిర్యాల గ్రామంలో నాలుగెకరాల భూమిని జనగామ జిల్లా మహిళా సమాఖ్య భవనం కోసం కొనుగోలు చేశారు. ఈ భూ కొనుగోలులో రూ.1.50 కోట్లు పక్కదారి పట్టాయని ఆరోపిస్తూ పలువురు మహిళా సమాఖ్య సభ్యులు జనగామ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారం తాజాగా ఆడిట్‌లో వెలుగు చూసింది. ఎలాంటి తీర్మానం చేయకుండానే భూ కొనుగోలు చేసినట్టు తేలడంతో దీనిపై ఆడిటర్లు రూపొందించిన నివేదికను ఉన్నతాధికారులకు పంపుతున్నట్టు సమాచారం. ఎకరానికి రూ.58.75 లక్షల ధరతో నాలుగెకరాలను కొనుగోలు చేశారు. ఎందుకు పనికిరాని బీడు భూమిని ఇంత భారీ ధరకు కొనుగోలు చేయడంపై విమర్శలు వెల్లువెత్తాయి. కాగా, ఈ భూమి కొనుగోలులో సమాఖ్య సభ్యుల అనుమతి తీసుకోకపోవడంతో పాటు, సమాఖ్యలో తీర్మానం చేయకుండానే నిర్ణయం తీసుకొని భూమిని కొనుగోలు చేశారనే ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారంలో జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు, కార్యదర్శి, కోశాధికారితోపాటు డీపీఎం, మరో ఉన్నతాధికారి వ్యవహారశైలిపై పలువురు సందేహాలు వ్యక్తం చేశారు.

# క్రీడలతో మానసిక ఉల్లాసం

## మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్



హనుమకొండ, అక్టోబర్ 25 (తీన్మార్ న్యూస్): హనుమకొండ జిల్లా రామారం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన కార్బన్ స్పోర్ట్స్ కేంద్రాన్ని శుక్రవారం రోజున ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యాంత్రిక జీవనంలో క్రీడలు ఉల్లాసాన్ని కలిగిస్తాయని అన్నారు. శారీరక శ్రమ తగ్గుతున్న క్రమంలో క్రీడా కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడుతాయని తెలిపారు. స్పోర్ట్స్ క్లబ్ లు ఆట విడుపుగా, శారీరక దారుఢ్యాన్ని పెంపొందించేందుకు దోహదపడుతాయి. మనిషి జీవితంలో వ్యాయామము ఒక భాగం కావాలని సూచించారు. ఆటలు, వ్యాయామం చేసే వారు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. అనంతరం కార్బన్ స్పోర్ట్స్ సెంటర్ ను ఏర్పాటు చేసిన ప్రణయ్‌ను అభినందించారు. షటిల్ ఆడారు. కార్యక్రమంలో నాయకులు చుంచు కృష్ణ, కాటాపూర్ రాజు, అరవింద్,రాజేష్,జే కే,చారి పాల్గొన్నారు.

# వర్సిటీల ప్రతిష్టను పెంచండి

## - మూడు నెలలకోసారి సమావేశమవుదాం : నూతన వీసీలకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సూచన

హైదరాబాద్: విశ్వవిద్యాలయాల ప్రతిష్టను పెంచే బాధ్యత ఉపకులపతుల (వీసీ)దేనని వర్సిటీల చాన్సలర్, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో నూతనంగా నియామకమైన వీసీలతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి, గవర్నర్ కార్యదర్శి బుర్రా వెంకటేశం, జాయింట్ సెక్రెటరీ భవానీ శంకర్, ఉన్నత విద్యామండలి చైర్మెన్ వి బాలకిష్టారెడ్డి, వైస్ చైర్మెన్లు ఎస్‌కే మహమూద్, ఇటిక్యాల పురుషోత్తం, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్‌తోపాటు పలు వర్సిటీల వీసీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీసీలకు గవర్నర్ వలు సూచనలు చేశారు. విశ్వవిద్యాలయాల్లో ప్రమాణాలు మెరుగుపర్చాలనీ, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని కోరారు. పరిశోధనలపై దృష్టిసారిం చాలని సూచించారు. ప్రపంచంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఉపాధి అవకాశాలను మెరుగుపర్చే కొత్త కోర్సులను ప్రవేశపెట్టే విధంగా ఆలోచించాలని చెప్పారు. విశ్వవిద్యాలయాల పనితీరుపై ఇకనుంచి మూడు నెలలకోసారి సమావేశాన్ని నిర్వహించి సమీక్ష జరుపుదామని అన్నారు. విశ్వవిద్యాలయాల ప్రగతి, సాధించిన విజయాలు, రావాల్సిన మార్పులు, తీసుకోవాల్సిన చర్యలపై చర్చిద్దామని వివరించారు. వర్సిటీలను బలోపేతం చేయాలని సూచించారు. జవాబుదారీతనంతో వ్యవహరించాలని కోరారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల స్థితిగతులు, ప్రస్తుత పరిస్థితి గురించి వీసీలు గవర్నర్ దృష్టికి తెచ్చినట్టు సమాచారం. వర్సిటీల పరిస్థితి అధ్వాన్నం గా మారిందనీ, 50 శాతం కూడా పర్మినెంట్ అధ్యాపకులేరనీ, నియామ కాల ప్రక్రియ లేకపోవడంతో అధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించినట్టు తెలిసింది. ఇంకోవైపు సరిపడా నిధుల్లేవనీ,వర్సిటీల అభివృద్ధికి అవసరమైన నిధులను కేటాయించాల్సి ఉందని గవర్నర్ దృష్టికి తెచ్చినట్టు సమాచారం. అయితే నిధుల విషయంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తాను తీసుకెళ్తానని వీసీలకు గవర్నర్ హామీ ఇచ్చినట్టు తెలిసింది.

# తాగిన మైకంలో చిన్నారి విక్రయం

- ఆ తర్వాత.. అపహరించిందంటూ కేసు..
- తల్లి చెంతకు చేర్చిన పోలీసులు
- ఆలస్యంగా వెలుగులోకి



వేములవాడ: ఎల్లారెడ్డిపేటకు చెందిన శ్యామల-రవీందర్ దంపతులు కొంతకాలంగా వేములవాడలో నివాసముంటూ రాజన్న ఆలయ పరిసరాల్లో భిక్షాటన చేస్తూ జీవిస్తున్నారు. ఆ దంపతులకు ఐదుగురు సంతానం. అందులో చిన్న పాప మేఘన(10నెలలు)ను విక్రయించాలని భార్యాభర్తలు నిర్ణయించుకున్నారు. ఇదే విషయాన్ని గతంలో తమకు పరిచయం ఉన్న జగిత్యాల జిల్లా గోవింద్‌పల్లెకు చెందిన లక్ష్మికి ఫోన్ చేసి చెప్పారు. దీంతో మంగళవారం వేములవాడకు వచ్చిన లక్ష్మీతో కలిసి శ్యామల-రవీందర్ తిప్పాపురంలో మద్యం తాగారు. చిన్నారి మేఘనను రూ.90వేలకు లక్ష్మికి విక్రయించారు. స్టాంప్ పేపర్‌పైనా రాయించి ఇచ్చారు. సీన్ కట్ చేస్తే.. గురువారం తన పాపను లక్ష్మి అపహరించిందంటూ శ్యామల పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు విచారణ చేపట్టగా అసలు విషయం బయటపడింది. చిన్నారిని లక్ష్మి నుంచి స్వాధీనం చేసుకుని తల్లి శ్యామలకు అప్పజెప్పి, కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ సీఐ వీరప్రసాద్ తెలిపారు.

# గేటెడ్ కమ్యూనిటీలకు అంతంత మాత్రమే

హైదరాబాద్: హైదరాబాద్ నగరంలో గేటెడ్ కమ్యునిటీని ప్రజలు కోరుకుంటున్నారా? లేక తక్కువ సంఖ్యలో ఉన్న అపార్ట్‌మెంట్ ఫ్లాట్స్ ఉన్న వాటినే ఎంచుకుంటున్నారా? అన్న ప్రశ్నకు రెండోదానిపైనే ఎక్కువ మొగ్గు చూపుతున్నారు. గేటెడ్ కమ్యునిటీలో ఫ్లాట్స్ కొనుగోలు చేయాలంటే హైదరాబాద్ నగరానికి కొంత దూరంగా వెళ్లాల్సి ఉంటుంది. ఎక్కువ మంది సీనియర్ సిటిజన్లు అపార్ట్‌మెంట్స్ లో ఫ్లాట్స్ ను కొనుగోలు చేయడానికి ఇష్టపడుతున్నారు. వారి వారసులందరూ విదేశాల్లో స్థిరపడటం, తాము ఇక్కడే ఉండి పోవడంతో కొంత ఫ్లాట్స్ అయితే భద్రత ఉంటుందని నమ్ముతున్నారు. సెక్యూరిటీ పరంగా మాత్రమే కాకుండా అన్ని రకాలుగా ఫ్లాట్స్ బెటర్ అని నమ్ముతున్నారు. అయితే నెలవారీ నిర్వహణ ఖర్చు ఎక్కువగా ఉండటంతో గేటెడ్ కమ్యునిటీలో ఫ్లాట్లు కొనుగోలు చేయడానికి వెనుకాడుతున్నారు ఇండిపెండెంట్ హౌస్‌లకు ఎక్కువ సొమ్ము పెట్టి వెచ్చించే అవకాశమున్నప్పటికీ వాటి జోలికి పోవడం లేదు. కొంత బెరుకు.. మరికొంత భయం వారిని వెంటాడుతుంది. సీనియర్ సిటిజన్లుగాఇద్దరు భార్యాభర్తలే ఇండిపెండెంట్ హౌస్‌లో ఉండటానికి ఇష?టపడటం లేదు. ఇద్దరే ఉన్న దంపతులను టార్గెట్ గా చేసుకుని కొన్ని ముఠాలు నగరంలో చెలరేగిపోతుండటం, బంగారు ఆభరణాలు, డబ్బులు కోసం హత్యల వరకూ తెగబడటం వంటివి చూసి సెక్యూరిటీ పరంగా కొంత అపార్ట్‌మెంట్ వైపు మొగ్గుచూపుతున్నారు. విదేశాల్లో ఉన్న వారు కూడా ఇలాంటి వాటిని కొనుగోలు చేసేందుకు ఇష్టపడుతున్నారు. తక్కువ ఫ్లాట్స్ ఉన్న అపార్ట్‌మెంట్స్ హైదరాబాద్ నగరంలో హాట్ కేకుల్లా అమ్ముడుపోతున్నాయి. తక్కువ ఫ్లాట్లు ఉంటే తాగు నీటి సమస్య రాదు. డ్రైనేజీ సమస్య తొందరగా తలెత్తదు. దీంతో పాటు ఉన్న పది మంది ఫ్లాట్ వాసులు కలివిడిగా ఉంటారు. ఎవరికి వారే అన్నట్లు అంటీముట్టనట్లు తలుపులు వేసుకుని ఉండరు. ఉదయం, సాయంత్రం వేళలలో పెద్దలతో బాతాఖానీ చెయొచ్చు. మహిళలు కూడా ఒక్కటిగా అన్ని పండగలు చేసుకునే సంప్రదాయం తక్కువ ఫ్లాట్స్ ఉన్న అపార్ట్ మెంట్లలోనే జరుగుతుంది. కారు పార్కింగ్ సమస్య కూడా పెద్దగా ఉండదు. కారును బయటకు తీయడానికి పెద్దగా కష్టపడాల్సిన పనిలేదు. అదే గేటెట్ కమ్యునిటీలో వందల సంఖ్యలో ఫ్లాట్స్ ఉంటే ఎవరు ఏ ఫ్లాట్ లో ఉన్నారో పక్క వారికి కూడా తెలియదు. బయట నుంచి వచ్చి తలుపు వేసుకున్నారంటే బయటకు రారు. ఆదివారాలు కూడా తలుపులు బిగించుకుని ఇంట్లోనే మగ్గిపోతుంటారు. దీంతో హైదరాబాద్ లో ఐదు చదరపు గజాల్లో నిర్మించిన పది నుంచి పన్నెండు ఫ్లాట్స్ ఉన్న అపార్ట్‌మెంట్లు మాత్రం హాట్ కేకుల్లా అమ్ముడుపోతున్నాయని రియల్ ఎస్టేట్ వ్యాపారులు చెబుతున్నారు. అదే సమయంలో గేటెడ్ కమ్యునిటీ ఫ్లాట్స్ లో కావల్సినన్ని ఖాళీగా దర్శనమిస్తున్నాయి.

# బెంగళూరు నుంచి మించిపోతున్న భాగ్యనగరం



హైదరాబాద్: ఐ టీ పరంగానూ హైదరాబాద్ బెంగళూరు తరువాత టాప్ ప్లేసులో కొనసాగుతోంది. అయితే.. బెంగళూరులో బతకలేని ఓ మాదిరి ఉద్యోగి కూడా హైదరాబాద్‌కు ట్రాన్స్‌ఫర్ కోరుకున్నాడు. అది మొన్నటివరకు అని మాత్రమే చెప్పాలి. ఒకప్పుడు బెంగళూరులో అద్దెలు చూసి భరించలేకపోయిన ఉద్యోగులు.. ఇప్పుడు వచ్చాక కూడా ఇవేమి అద్దెలురా బాబోయ్ అని అరవాల్సిన పరిస్థితి వచ్చింది. వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాలలో హైదరాబాద్ టాప్ ప్లేసులో నిలుస్తోంది. భాగ్యనగరంగా పేరొందిన హైదరాబాద్.. నిజంగానే పేదల పాలిట భాగ్యాలు పంచుతోంది. సామాన్యులకు కేరాఫ్ అడ్రస్ అయింది. అందుకే.. నిత్యం గ్రామాల నుంచి హైదరాబాద్‌కు వలస వచ్చే వారి సంఖ్య పెరుగుతూనే ఉంది. ఏటా హైదరాబాద్ విస్తీర్ణం కూడా అంతకంతకూ పెరుగుతోంది. హైదరాబాద్‌కు చేరుకుంటే ఏదో ఒక ఉపాధి చేసుకొని అయినా బతకొచ్చు అనే ధీమా వచ్చింది. అటు యువత కూడా జాబ్స్ కోసం హైదరాబాద్ బాట పడుతున్నారు. జిల్లాల్లో కొలువులు చేయడానికి ఇష్టపడకుండా మహానగరానికి చేరుకుంటున్నారు. హైదరాబాద్‌కు వచ్చి ఉపాధి పొందుతున్నారు. ఒకవిధంగా చెప్పాలంటే హైదరాబాద్ జనాభాలో సామాన్యులే అధిక శాతం అనేది చెప్పక తప్పదు. ఇక్కడ నెలకు పది వేలు సంపాదించినా బతకొచ్చు.. పది లక్షలు సంపాదించినా బతకొచ్చు. అయితే.. ఇప్పుడు మహానగరంలో కూడా జీవన యానం కాస్త పిరం అయింది. ఐటీ పరంగానూ హైదరాబాద్ బెంగళూరు తరువాత టాప్ ప్లేసులో కొనసాగుతోంది. అయితే.. బెంగళూరులో బతకలేని ఓ మాదిరి ఉద్యోగి కూడా హైదరాబాద్‌కు ట్రాన్స్‌ఫర్ కోరుకున్నాడు. అది మొన్నటివరకు అని మాత్రమే చెప్పాలి. ఒకప్పుడు బెంగళూరులో అద్దెలు చూసి భరించలేకపోయిన ఉద్యోగులు.. ఇప్పుడు వచ్చాక కూడా ఇవేమి అద్దెలురా బాబోయ్ అని అరవాల్సిన పరిస్థితి వచ్చింది. హైదరాబాద్‌లో కూడా అద్దెలు భరించలేని స్థాయికి చేరాయి. కాస్త రిచ్ అపార్టుమెంట్లలో డబుల్ బెడ్ రూం ఇళ్లు కనీసం 40 వేల నుంచి 50వేల రూపాయల వరకు తీసుకుంటున్నారు. మామూలు అపార్ట్మెంట్లలో 20వేలకు తక్కువ లేదు. శివారు ప్రాంతాల్లో అపార్ట్మెంట్లలోనూ మెయింటనెన్స్‌తో కలుపుకుని 20వేలకు చేరుతోంది. ఇండిపెండెంట్ ఇళ్లకు వచ్చేసరికి చిన్నిచిన్న పోర్షన్లకు కూడా పది నుంచి పది వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇక సింగిల్ రూముల పరిస్థితి అయితే మరీ దారుణంగా ఉంది. ఒక్క రూము రెంటు కూడా 6వేలకు పైగా పలుకుతోంది. దాంతో సామాన్యులు ఇల్లు అద్దెకు తీసుకొని బతికే పరిస్థితి లేకుండా పోయింది. అందులోనూ వలస వస్తున్న జనాభాకు తగినట్లుగా తక్కువ రేట్లలో ఎక్కడా ఇళ్లు కనిపించడం లేదు. ఫలితంగా చాలా మంది స్లమ్‌లలో జీవిస్తూ కనిపిస్తున్నారు. దే అంతా ఏదో ఒక ఉపాధి పొందుతూ రాత్రి పూట స్లమ్‌లలో కాలం వెళ్లదీస్తున్నారు. అయితే.. కరోనా సమయంలో హైదరాబాద్‌లోని ఏ వీధిలో చూసినా టూలెట్ బోర్డులే కనిపించేవి. అంతా ఇళ్ల బాట పట్టడంతో ఆ సమయంలో సగానికి పైగా అద్దెలు పడిపోయాయి. చాలా వరకు ఇళ్లు ఖాళీ అయ్యాయి. దాంతో కాస్త అద్దెల్లో మార్పు వచ్చింది. సింగిల్ బెడ్ రూమ్‌కు వసూలు చేసే అద్దెతో డబుల్ బెడ్‌రూమ్ కూడా ఇచ్చేశారు. ఇక.. ఇప్పుడు మళ్లీ హైదరాబాద్‌కు వలసలు పెరగడంతో మరోసారి ఇళ్లకు డిమాండ్ ఏర్పడింది. ఖాళీ పోర్షన్లే కనిపించడంలేదు. దాంతో అద్దెలు భగ్గుమంటున్నాయి. కరోనాకు ముందు పరిస్థితిని మించి వసూలు చేస్తున్నారు. ఇప్పుడు పరిస్థితులను చూసి బెంగళూరు నుంచి వలస వచ్చిన వారంతా ఇక్కడితో పోల్చితే అక్కడే బాగుండేనే అనే అభిప్రాయానికి వచ్చారు. సగటు 35వేల జీతం వచ్చే ఉద్యోగి కూడా వేతనంలో నుంచి పది వేలు అద్దెకు చెల్లించాల్సి వస్తోంది. ఇది పోను ఈఎంఐలు, చిట్టీలు తదితరాలతో మళ్లీ నెల వచ్చేసరికి అప్పు చేయాల్సిన పరిస్థితి వస్తోంది.

# రీఎంబర్స్మెంటు వెంటనే మంజూరు చేయాలి

## కలెక్టరేట్ ను ముట్టడించిన బిజెవైఎం నాయకులు



పెద్దపల్లి ప్రతినిధి: పెండింగులో ఉన్న ఫీజు రీఎంబర్సుమెంటు, స్కాలరుషిప్పులు ఇవ్వకుండా విద్యార్థులకు నరకం చూపిస్తున్న కాంగ్రెస్ పార్టీ భరతం పడతామని భారతీయ జనతా యువమోర్చా నాయకులు స్పష్టం చేసారు. విద్యార్థులకు బకాయిలు ఉన్న రూ. 7వేల5వందల కోట్లు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ యువమోర్చా నాయకులు కలెక్టరేటును ముట్టడించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి శివంగారి సతీష్ మాట్లాడుతు, అబద్దాలతో కాలం వెల్లదీస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మెడలు వంచి విద్యార్థులకు న్యాయం చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావొస్తున్నా బకాయిలను చెల్లించకుండా నిర్లక్ష్యపూరితంగా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరు పేద విద్యార్థుల జీవితాల పట్ల శాపంగా మారిందని మండిపడ్డారు. ఫీజు రీఎంబర్సుమెంటు, స్కాలరుషిప్పులు పేద విద్యార్థులకు సంజీవనితో సమానమని, వాటిని విడుదల చేయకపోవడం విద్యార్థులకు విద్యను దూరం చేసే కుట్రగా ప్రభుత్వం పాటుపడుతున్నట్లు తాము భావిస్తున్నమని అన్నారు. ఫీజులు చెల్లిస్తే కానీ సర్టిఫికెట్స్ ఇవ్వమంటూ కళాశాల యాజమాన్యాలు విద్యార్థులను ఒత్తిడికి గురి చేస్తున్నా, ప్రభుత్వం పట్టించుకోకపోవడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. మరోవైపు ఫీజు రీఎంబర్సుమెంటు బకాయిలు చెల్లిస్తే తప్పా కళాశాలలు నడపలేని స్థితికు చేరుకున్నాయని వివరించారు. చిత్తశుదిలేని కాంగ్రెస్ నాయకుల పరిపాలన వలన విద్యార్థులు బలయ్యే పరిస్థితి దాపురించిందని అసహనం వ్యక్తం చేశారు. విద్యాలయాలను, విద్యావ్యవస్థను పటిష్ట పర్చాల్సిన ప్రభుత్వం విద్యను అంధకారంలోకి నెట్టి, నూతనంగా ఇంటర్నేషనల్ పాఠశాలలు, యూనివర్సిటీలంటూ కొత్త హామిలతో చేతులు దులుపుకుంటుందని ధ్వజమెత్తారు. సమస్యను పరిష్కరించాలని అధికారులకు వినతిపత్రాలు ఇస్తున్నా, ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్టులేదని ఎద్దేవా చేశారు. పెండింగులో ఉన్న ఫీజు రీఎంబర్సుమెంటు, స్కాలరుషిప్పులను వెంటనే విడుదల చేయాలని, లేనిపక్షంలో బిజెవైఎం ఆద్వర్యంలో భారీ ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని సతీష్ హెచ్చరించారు. అనంతరం జిల్లా కలెక్టరు కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ ఆందోళనలో దళితమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె సదానందం, నాయకులు అభినయ్, రామగిరి అఖిల్, నరేష్, జంగా చక్రధర్ రెడ్డి, క్రాంతి, సందీప్, కృష్ణ, సంతోష్, విజయ్, వెంకటేష్, ఆకాష్, రిషికేష్ అధిక సంఖ్యలో యువమోర్చా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేగా ఉన్నంతకాలం రైతులకు అన్యాయం జరగనివ్వను

## పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణా రావు



పెద్దపల్లి: తాను ఎమ్మెల్యేగా ఉన్నంతకాలం రైతులకు అన్యాయం జరగనివ్వనని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణా రావు అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక మార్కెట్ చైర్మన్ ఈర్ల స్వరూప, మార్కెట్ అధికారులు, స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఉన్నంతకాలం ధాన్యం కోతలు అనే పదానికీ తావు ఇవ్వనని స్పష్టం చేశారు. ప్రస్తుత సీజన్ వడ్లను కొనుగోలు సందర్భంగా ఎక్కడైనా కటింగ్ చేస్తే తాను అక్కడికి వచ్చి వాలుతానని, సన్న రకాల ధాన్యానికి క్వింటాలకు రూ. 500 బోనస్ చెల్లించడం జరుగుతుంద న్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వడ్ల కటింగ్ పేరున కట్ చేస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. సన్న రకం వడ్ల విషయంలో ఎలాంటి సందేహాలకు తావివ్వకూడదని, పరిమితం లేకుండా ఎన్ని క్వింటాళ్ల సన్న వడ్లు అమ్మినప్పటికీ అమ్మిన మొత్తానికి వారికి బోనస్ చెల్లించడం జరుగుతుందని పేర్కొన్నారు. గతంలో రుణమాఫీ చేయని బీఆర్ఎస్ పార్టీ నేతలు రైతుల్లో కావాలని అపోహలు సృష్టిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో రైతులకు ఏమాత్రం అన్యాయం జరగకుండా సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని, రైతు ప్రభుత్వ పరంగా పాలన సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు ఏమాత్రం అన్యాయం జరిగినా తాను ముందుండి రైతుల పక్షాన నిలబడతానని భరోసా ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే రాష్ట్ర పశుసంవర్ధక శాఖ వారి 21వ అఖిల భారత పశుగణన వాల్ పోస్టర్‌ను స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరిం చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఈర్ల స్వరూప, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, అధికారుల, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు రైతులు, హమాలీలు తదితరులు పాల్గొన్నారు.

# ఐక్యరాజ్య సమితిలో శాశ్వత సభ్యత్వం పొందడం భారతీయులు గర్వించదగ్గ విషయం




మంథని: ఐక్యరాజ్య సమితిలో భారత దేశం శాశ్వత సభ్యత్వం పొందడం భారతీయులందరు గర్వించదగ్గ విషయమని బీజేపీ నాయకులు సత్యప్రకాశ్, సబ్బని సంతోష్‌లు అన్నారు. మంథనిలోని ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ 65 ఏళ్లు అధికారంలో ఉన్నా ఐక్యరాజ్య సమితిలో శాశ్వత సభ్యత్వం కోసం ఏనాడు ఆలోచన చేయలేదన్నారు. ఐక్యరాజ్య సమితిలో శాశ్వత సభ్యత్వం రాక పోవడానికి నాటి కాంగ్రెస్ ప్రభుత్వం తన బలమైన ధోరణి వినిపించక పోవడమేనన్నారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ కేవలం 10 సంవత్సరాల కాలంలో ఐక్యరాజ్య సమితి శాశ్వత సభ్యత్వాన్ని భారతదేశానికి దక్కించిందన్నారు. ఇందుకు ప్రధాని మోదీ పాలన, ధౌత్యమే కారణమన్నారు. ప్రపంచ దేశాలను ధౌత్య సంబంధాలతో ఒప్పించి మెప్పించి శాశ్వత సభ్యత్వాన్ని తీసుకువచ్చిన ఘనత ప్రధాని నరేంద్ర మోదీదన్నారు. ప్రపంచంలో ఉన్న అన్ని దేశాలు బాగుండాలని, సుఖః సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించేది భారతదేశమని యావత్ ప్రపంచమే గ్రహించిందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ దేశాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు రానున్న రోజుల్లో యుద్ధాలు రాకుండా సైతం మోదీ చర్యలు తీసుకుంటారన్నారు. బీజేపీ పాలనతో దేశం రానున్న రోజుల్లో సూపర్ పవర్ దేశంగా మారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బోగోజు శ్రీనివాస్, రాపర్తి సంతోష్, చిలువేరి సతీష్, రమేష్, లక్ష్మణ్, శంకర్, అశోక్‌లు పాల్గొన్నారు.

# కమ్యూనిటీహాల్ నిర్మాణమునకు స్థలం కేటాయించండి

## – మున్సిపల్ చైర్మన్ కు వినతిపత్రం అందజేసిన కాంగ్రెస్ బీసీ సెల్ నాయకులు



మంథని: మంథని మున్సిపాలిటి పరిధిలో బిసి కమ్యూనిటీహాల్ నిర్మాణమునకు స్థలం కేటాయించాలని కోరుతూ మంథని మున్సిపల్ చైర్మన్ పెంద్రు రమా సురేష్ రెడ్డి కి కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోటికార్ కిషన్ జీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోటికార్ కిషన్ జీ మాట్లాడుతూ మంథని శాసనసభభ నియోజకవర్గ కేంద్రంలో బీసి కమ్యూనిటి హాల్ నిర్మాణము చేయుటకు మంత్రి శ్రీధర్ బాబు గతంలో శాసనసభ్యులుగా ఉన్నప్పుడే ఐదు లక్షల నిధులు మంజూరు చేశారన్నారన్నారు. మంథనిలో 60 శాతానికి పైగా బీసిలు ఉన్నందున నియోజకవర్గ కేంద్రంలో బీసి కమ్యూనిటి హాల్ నిర్మించుట తప్పనిసరి అని అన్నారు, మంథని మున్సిపాలిటీ పరిధిలో గల గోదావరి నదికి వెల్లు మార్గంలో కరెంటు సబ్ స్టేషన్ ప్రక్కన మున్సిపాలిటి భూమి ఉందని అట్టి భూమిలో కొన్ని గుంటలు ఇచ్చినచో కమ్యూనిటి హాల్ నిర్మాణము చేసుకొనగలమన్నారు. ఇంతకు ముందు ఎన్నో పర్యాయాలు మీకు విజ్ఞప్తి చేసామని గుర్తు చేశారు. బీసిల సంక్షేమాన్ని ద్రుష్టిలో ఉంచుకొని కమ్యూనిటిహాలు నిర్మాణమునకు మున్సిపాలిటి భూమిని ఇప్పించాలని కోరుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో బిసి సెల్ నాయకులు పర్శవెన మోహన్ యాదవ్, మంతెన వేణుగోపాల్, కౌన్సిలర్ వికే రవి పాల్గొన్నారు.

# బాణసంచా విక్రయ దుకాణాలకు ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి

## జిహెచ్ఎంసి కమిషనర్ ఇలంబర్తి

హైదరాబాద్: బాణాసంచా (పటాకుల షాపులు) విక్రయ దుకాణదారులు తప్పనిసరిగా జిహెచ్ఎంసి నుంచి తాత్కాలిక ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని, లైసెన్స్ లేకుండా షాప్ పెట్టుకోవడానికి అనుమతి ఇవ్వబడదని జిహెచ్ఎంసి కమిషనర్ ఇలంబర్తి స్పష్టం చేశారు. ట్రేడ్ లైసెన్స్ ఫీజు రిటైల్ షాపులకు రూ. 11 వేలు, హోల్ సేల్ షాపులకు రూ. 66 వేలు గా నిర్ణయించినట్లు తెలిపారు. బాణాసంచా దుకాణాల నిర్వాహకులు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా లైసెన్స్ పొంది నిబంధనల మేరకు దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పటాకుల దుకాణాలు ఏర్పాటు చేసుకునే వారంతా నిర్ణీత ఫీజును చెల్లించి జిహెచ్ఎంసి నుంచి ముందస్తు అనుమతి పొందాల్సి ఉంటుందని తెలిపారు. తాత్కాలిక ట్రేడ్ ఐడెంటిఫికేషన్ నెంబర్ కొరకు సిటిజన్ సర్వీస్ సెంటర్/ జిహెచ్ఎంసి వెబ్సైట్/ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. డిమాండ్ డ్రాఫ్ట్, డెబిట్/ క్రెడిట్ కార్డులు, నెట్ బ్యాంకింగ్ ద్వారా ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లించవచ్చన్నారు. అదేవిధంగా తమ గుర్తింపు రుజువుకు ఆధార్ కార్డు, పాన్ కార్డు కాఫీ ఇవ్వాలని కోరారు. బాణాసంచా షాపులను ఫుట్ పాత్ లు, జనావాసాల మధ్య ఏర్పాటు చేయరాదని తెలిపారు. కాలనీ, బస్తీలకు దూరంగా ఓపెన్ గ్రౌండ్ లో / పెద్ద హాల్ లో తగిన ఫైర్ సేఫ్టీ తో షాపులను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే మంటలను ఆర్పడానికి వీలుగా అగ్నిమాపక నిరోధక పరికరాలు అందుబాటులో సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి స్టాల్ వద్ద చుట్టు పక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దుకాణాలకు దగ్గరగా ఎట్టి పరిస్థితుల్లోనూ బాణాసంచా కాల్చకూడదని, షాపులో ఏర్పాటు చేసే లైట్లు ఇతరత్రా కరెంటు పరికరాలకు నాణ్యమైన విద్యుత్ వైర్ ను వినియోగించాలని సూచించారు. స్టాల్ లో ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగినట్లయితే స్టాల్ హోల్డర్ దే బాధ్యతని, చట్టపరమైన చర్యలకు బాధ్యుడని తాత్కాలిక ట్రేడ్ లైసెన్స్ సర్టిఫికెట్ లో స్పష్టంగా పేర్కొనడం జరుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి జారీ చేసిన ఉత్తర్వులను కచ్చితంగా పాటించాలని సూచించారు. సుప్రీం కోర్ట్/హై కోర్ట్/రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు టైం టు టైం జారీ చేసే అన్ని ఉత్తర్వులను కచ్చితంగా పాటించాలని తెలిపారు. ఫైర్ క్రాకర్స్ అయిన సిరీస్ క్రాకర్స్/ లడీస్ తయారీ, అమ్మకాలు, వినియోగించడం నిషేధించడం జరిగిందని, వాటి అమ్మకాలకు అనుమతించరని స్పష్టం చేశారు. జిహెచ్ఎంసి ఆక్ట్ 1955/న్యాయస్థానాలు/టిఎస్పిసిబి/ ప్రభుత్వ ఉత్తర్వులు, మార్గదర్శకాలను ఉల్లంఘించినట్లయితే తాత్కాలిక ట్రేడ్ లైసెన్స్ సర్టిఫికెట్ రద్దు చేయడం జరుగుతుందని కమిషనర్ స్పష్టం చేసారు. ఏర్పాటు చేసిన స్టాల్స్ లను డిప్యూటీ కమిషనర్, జోనల్ కమిషనర్లు, హెడ్ ఆఫీసు నుండి అధికారుల బృందం వచ్చి ఆకస్మిక తనిఖీలు చేస్తారని కమిషనర్ పేర్కొన్నారు.

# జీవో 46 బాధితుల సమస్యలను సీఎస్ దృష్టికి తీసుకెళతా

## – ముఖాముఖిలో మంత్రి శ్రీధర్‌బాబు హామీ

హైదరాబాద్: రాష్ట్రంలో జీవో 46 బాధితుల సమస్యను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దృష్టికి తీసుకెళతామని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చెప్పారు. ఈ జీవో సాధ్యాసాధ్యాలపై బాధితులు చెప్పుకోవాలని సూచించారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో బాధితుల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. తమ సమస్యలను విన్నవించుకునేందుకు భారీగా ప్రజలు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా వికలాంగులు, వీఆర్ఏ, డీఎస్సీ అభ్యర్థులు తదితర సంఘాల ప్రతినిధుల సమస్యలను తమ దృష్టికి తెచ్చారని తెలిపారు. దళిత క్రైస్తవుల కులమేదో తేల్చాలి కులగణన సర్వేలో దళిత క్రైస్తవుల కులమేదో తేల్చాలంటూ ఏజేసీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు నాగాళ్ల పోచయ్య ఇశ్రాయేల్, కో కన్వీనర్స్ ఎంవీ జాన్సన్, కె డానియల్, ఆంద్రూ జేవీయర్, నాయకులు బిషప్ ఎం సామ్యూల్ తదితరులు ముఖాముఖిలో మంత్రికి వినతిపత్రం సమర్పించారు. ఇది 80 లక్షల మంది సమస్య అని పేర్కొన్నారు. గంగారెడ్డి హత్య దురదృష్టకరం ఇటీవల జగిత్యాల జిల్లాలో జరిగిన గంగారెడ్డి హత్య దురదృష్టకరమని మంత్రి శ్రీధర్‌బాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఆ హత్యను తీవ్రంగా ఖండించారు. జీవన్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడైన సీనియర్ కాంగ్రెస్ నేత కావడంతో ఆయన బాధలో ఉన్నారని తెలిపారు. ఆ కుటుంబానికి అండగా ఉండాలని పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, సీఎం రేవంత్ రెడ్డి చెప్పారని గుర్తు చేశారు. ఆ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, ఆ కుటుంబానికి న్యాయం చేస్తామన్నారు. డీజీకి, జిల్లా ఎస్పీకి ఆదేశాలు ఇచ్చామన్నారు. పార్టీపరంగా సమన్వయం చేయాలని పీసీసీ అధ్యక్షులు తనకు చెప్పారని వివరించారు. ఈ విషయంపై జీవన్‌రెడ్డితో తాను మాట్లాడినట్టు తెలిపారు. పూర్తి స్థాయిలో విచారణ జరపాలని కోరామన్నారు. ఆ హత్య వెనుక ఎవ్వరు ఉన్న వదిలి పెట్టేది లేదని స్పష్టం చేశారు.



# నవంబర్ 2 నుంచి సమ్మె తప్పదా..?

హైదరాబాద్: వేతన సవరణ, డిఏ బకాయిల చెల్లింపు సహా ఇతర అపరిష్కృత సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ ఉపాధ్యాయ, కార్మిక సంఘాలు పోరుబాట పడుతున్నట్టు ప్రకటించారు. నవంబర్ 2 నుంచి ఆందోళన కార్యక్రమాలకు పిలుపునిచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై పది నెలలు పూర్తైనా ఫలితం లేదని ఆరోపిస్తున్నారు.తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలైనా ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కాలేదని ఆరోపిస్తూ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు పోరుబాట పడుతున్నట్టు ప్రకటించాయి. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే తమ జీవితాల్లో మార్పు వస్తుందని భావించినా అది జరగలేదని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు.ఉద్యోగుల సమస్యలు తీరుస్తామని ఎన్నికల ప్రణాళికలో హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 10 నెలలలైనా వాటిని పరిష్కరించ లేదని విధిలేని పరిస్థితుల్లో ఉద్యమబాట పడుతున్నట్టు తెలంగాణ ఉద్యోగుల ఐకాస ప్రకటించింది.తెలంగాణ ఎన్జీవో కేంద్ర కార్యాలయంలో 206 ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షవర్ల, కార్మిక సంఘాలతో కూడిన తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఉమ్మడి సమస్యల పరిష్కారం కోసం అన్ని ఉద్యోగ సంఘాలతో కలిసి జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, జనరల్ సెక్ర టరీ ఏలూరి శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడారు.తెలంగాణలో ఇప్పటికే ఐదు డిఏలు బకాయిలో ఉండటం చరిత్రలో ఎన్నడూ చూడలేదని జేఏసీ నేత జగదీశ్వర్ అన్నారు. ఉద్యోగులు దాచుకున్న జీపీఎఫ్ డబ్బులు కూడా ప్రభుత్వం ఇవ్వట్లేదని ఆరోపించారు. బకాయిలు చెల్లించాలని, తమ పొదుపు డబ్బులు ఇవ్వాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వినతి పత్రాలిచ్చినా కనీసం చర్చించే పరిస్థితి కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు.దసరాలోగా రెండు డీఏలు వస్తాయని ఆశలు పెట్టుకున్నామని, ఇప్పుడు దీపావళి పై ఆశలు పెట్టుకున్నామని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక ఉద్యోగ సంఘాలకు ప్రభుత్వాలు గౌరవం లేకుండా చేశాయని ఆరోపించారు. ఉద్యోగుల సమస్యలపై 26న జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిన ఆరు ప్రధాన డిమాం డ్లను పరిష్కరించాలని కోరుతున్నా పట్టించుకోలేదని జేఏసీ ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగుల 44 ఆర్థికేతర సమస్యల పరిష్కారానికి కూడా చొరవ తీసుకోలేదని, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఒక్క రోజు ఉద్యోగ సంఘాలతో కూర్చొని చర్చిస్తే వాటిని పరిష్కరించవచ్చన్నారు.

ఉద్యోగుల ఆరు ప్రధాన డిమాండ్లు ఇవే..

- 2022 జులై 1 నుంచి పెండింగ్లో ఉన్న అయిదు డీఏలను విడుదల చేయాలి. బకాయిలను నగదు రూపంలోనే చెల్లించాలి.
- పెండింగులో ఉన్న అన్ని బిల్లులను మంజూరు చేయాలి. ఇ-కుబేర్ వ్యవస్థను రద్దు చేయాలి. ఖజానా శాఖ ద్వారా బిల్లులను క్లియర్ చేసే పాత విధానాన్ని పునరుద్ధరించి ఉద్యోగులకు బకాయిలు చెల్లించాలి.
- ధరల పెరుగుదల ప్రకారం 51 శాతం ఫిట్మెంట్ ఇవ్వాలి. 2వ వేతన సంఘం (పీఆర్సీ) సిఫార్సుల నివేదికను తెప్పించుకొని అమలు చేయాలి.
- ప్రభుత్వం, ఉద్యో గులు/ పెన్షనర్ల కంట్రిబ్యూషన్లో సమానంగా ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ అమలు చేయాలి.
- సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ పథకాన్ని పున రుద్ధరించాలి.
- జీవో 317ను సమీక్షిం చాలి. బాధితుల ఫిర్యా దులన్నీ పరిష్కరించాలి.

జేఏసీ ఉద్యమ ప్రణాళిక ఇది?

√ నవంబరు 2: అన్ని జిల్లాల్లో జిల్లా కలెక్టర్లకు కార్యాచరణ లేఖల అందచేస్తారు

√ నవంబర్ 4, 5 తేదీలు: జిల్లాల వారీగా ప్రజాప్రతినిధులకు వినతిపత్రాల సమర్పిస్తారు.

√ నవంబర్ 6వ తేదీ: ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహిస్తారు.

√ నవంబర్ 7 నుంచి డిసెంబరు 27 వరకు: డిమాండ్ల పరిష్కారం కోసం 10 ఉమ్మడి జిల్లాల్లో సదస్సులు నిర్వహిస్తారు.

√ జనవరి 3-4 వరకు: నల్లబ్యాడ్జీలతో విధులకు.. భోజన విరామంలో నిరసనలు చేపడతారు.

√ జనవరి 21: తెలంగాణలోని జిల్లాల్లో మౌన ప్రదర్శనలు నిర్వహిస్తారు.

√ జనవరి 23వ తేదీ: రాష్ట్రవ్యాప్తంగా బైక్ ర్యాలీలు నిర్వహిస్తారు.

√ జనవరి 30వ తేదీ: రాష్ట్రంలోని అన్ని కార్యాలయాల వద్ద మానవహారాలతో నిరసన చెబుతారు.

# మళ్లీ తప్పులో కాలు..



హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నామ్ చేసేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. అవకాశాన్ని వినియోగించుకుని బోర్లా పడుతున్నారు. లేటెస్ట్గా తెలంగాణ విద్యుత్ ఛార్జీలు పెంచుతారంటూ అప్పుడు ప్రచారం మొదలుపెట్టేశారాయన.అధికార పార్టీపై ఉద్యమం చేయాలంటే జాగ్రత్తగా ఒకటికి రెండు సార్లు ఆలోచించాలి. తేడా వస్తే ప్రజలు చాలా చులనకగా చూస్తారు. దానికి ఓ ఒక్కపార్టీ మినహాయింపు కాదు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నుంచి బురద జల్లుతూనే ఉన్నారు కేటీఆర్ సంబంధం లేని విషయాన్ని తమకు అనుకూలంగా మలచుకుని ప్రత్యర్థులపై రాళ్ల వేయడం మొదలుపెట్టారు. ఈ విషయంలో బోర్లా పడ్డారు.. పడుతున్నారు కూడా. అయినా కాంగ్రెస్ సర్కార్ ఏదో చేస్తోందని చెప్పే ప్రయత్నం చేస్తున్నారు.అందుకు ఎగ్జాంపుల్ గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు. బీజేపీ నేతలు చేస్తున్న నిరసనలోకి ఎంట్రీ ఇచ్చి దాన్ని తమవైపు తిప్పుకునే ప్రయత్నం చేశారు. అడ్డంగా దొరికిపోయారు ఆ పార్టీ నేతలు. సుప్రీంకోర్టు ఆదేశాల తో సైలెంట్ అయిపోయారు. తమ కారణంగా అభ్యర్థులకు న్యాయం జరుగుతుందని తమవైపు తిప్పుకునే ప్రయత్నం చేశారు. పరీక్షలు రాసే అభ్యర్థుల్లో చులకనైపోయారాయన.లేటెస్ట్గా తెలంగాణాలో విద్యుత్ ఛార్జీల పెంపు అంటూ కొత్త రాగం ఎత్తుకున్నారు మాజీ మంత్రి కేటీఆర్.ఎలక్ట్రిసిటీ రెగ్యులేషన్ కమిషన్ ఛైర్మన్ మనోడేనని భావించి, విద్యుత్ ఛార్జీలు పెంచుతున్నట్లు ఆయనతో చెప్పించారట. ఆ వెంటనే రంగంలోకి దిగి డ్రామా రక్తి కట్టించారు. ఈ నెలాఖరుతో ఛైర్మన్ రిటైర్ కాబోతున్నాడు. ఈలోపే ఆయన్ని అడ్డుపెట్టుకుని ప్రభుత్వాన్ని బద్నాం చేసేలా ప్లాన్ చేశారు.బీఆర్ఎస్ చేస్తున్న ప్రచారాన్ని తిప్పటికొట్టే ప్రయత్నం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం. విద్యుత్ ఛార్జీల పెంపు ఆలోచన లేదన్నారు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. దీనిపై అధికారులకు క్లారిటీ ఇచ్చినట్టు సమాచారం. అసలు విషయం తెలుసు కోకుండా బీఆర్ఎస్ విమర్శలు గుప్పించడాన్ని తప్పుపట్టారు.విద్యుత్ ఛార్జీల పెంపు ఆలోచన లేదన్నారు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. దీనిపై అధికారులకు ఆయన క్లారిటీ ఇచ్చినట్టు సమాచారం. అసలు విషయం తెలుసుకోకుండా బీఆర్ఎస్ విమర్శలు గుప్పించడాన్ని తప్పుపట్టారు. గత ప్రభుత్వం మూడుసార్లు ఛార్జీలు పెంచింది. విద్యుత్ సంస్థల నష్టాలను వెల్లడించకుండా నాశనం చేసిందని దుయ్యబడు తున్నారు.డిస్కంలు వేల కోట్ల అప్పుల్లో కూరుకుపోయాయని విద్యుత్ రంగ నిపుణులు సైతం ఆరోపిస్తున్నారు. ఛార్జీల పెంపు ప్రతిపాదనలపై నిజామాబాద్ లో ఈఆర్సీ విచారణ జరుపుతోంది.

# జీవన్ రెడ్డి గుడ్ బై చెప్పేస్తారా ?



నిజామాబాద్: కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పార్టీకి గుడ్ బై చెప్పే అవకాశాలున్నాయి. ఆయన త్వరలోనే తన నిర్ణయాన్ని ప్రకటించనున్నారని తెలిసింది. ఈ మేరకు జగిత్యాలలో ఆయన తన అనుచరులతో సమావేశమైన జీవన్ రెడ్డి ఒకటి, రెండు రోజుల్లో తన నిర్ణయాన్ని ప్రకటించనున్నారని చెబుతున్నారు. తన ప్రధాన అనుచరుడు గంగారెడ్డి హత్యకు గురి కావడంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. మీకో దండం.. మీ పార్టీకో దండం అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు దీనికి అద్దం పడుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత తాను ఎన్నో అవమానాలను ఎదుర్కొన్నానని, అయినా పార్టీ కోసం భరిస్తూ వస్తున్నానని జీవన్ రెడ్డి తెలిపారు. జీవన్ రెడ్డి సీనియర్ కాంగ్రెస్ నాయకుడు. కొన్ని దశాబ్దాలుగా ఆయన కాంగ్రెస్ లో కీలక నేతగా కొనసాగుతున్నారు. దాదాపు నలభై ఏళ్ల నుంచి ఆయన రాజకీయాల్లో ఉన్నారు. తొలుత టీడీపీ నుంచి ఆయన రాజకీయ ప్రస్థానం ప్రారంభమయినా తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరి ఆయన కొనసాగుతున్నారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత హత్యలు పెరిగాయని, శాంతిభద్రతలు పెరిగాయని జీవన్ రెడ్డి ఆరోపించడం కూడా ఆయన పార్టీ పట్ల ఎంత విసుగు చెందారో? అర్థమవుతుంది. జీవన్ రెడ్డి సీనియర్ నేత కావడంతో ఆయన కాంగ్రెస్ నుంచి వైదొలిగితే ఆ ప్రాంతంలో పార్టీకి పెద్ద షాక్ అని చెప్పాలి. గతంలోనే జీవన్ రెడ్డి అసంతృప్తిగా ఉన్నారు. జగిత్యాల నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచిన సంజీవ్ కుమార్ ను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్న నాటి నుంచి ఆయనలో అసహనం కట్టలు తెంచుకుంటోంది. పార్టీ తనకు అన్యాయం చేస్తుందన్న భావనకు వచ్చారు. అప్పుడే రాజీనామాకు సిద్ధపడిన జీవన్ రెడ్డి హైకమాండ్ పెద్దలు సముదాయించారు. ఢిల్లీకి పిలిపించి మరీ శాంతింప చేశారు. మంత్రి పదవి కూడా దక్కకపోవడంతో జీవన్ రెడ్డి చాలా కాలం నుంచి అసంతృప్తితో ఉన్నారు. తనకు మంత్రి పదవి రాకుండా కావాలనే కొందరు అడ్డుకుంటున్నారని ఆయన గాంధీభవన్ కు రావడం కూడా ఇటీవల కాలంలో తగ్గించారు. పార్టీలో కూడా యాక్టివ్ గా కనిపించడం లేదు. వాటికే డిమాండ్ అట తెలంగాణ వచ్చిన తర్వాత కూడా... అయితే ఈ నేపథ్యంలోనే జీవన్ రెడ్డి కఠిన నిర్ణయం తీసుకోవాలని సిద్ధమయినట్లు తెలిసింది. తెలంగాణ వచ్చిన తర్వాత కూడా తమ పార్టీ కాంగ్రెస్ నేతలకు న్యాయం జరగకపోగా, తన ప్రధాన అనుచరుడు గంగారెడ్డిని హత్యచేయడాన్ని సీరియస్ గా తీసుకున్నారు. ఇక పార్టీలో ఉండి కూడా వేస్ట్ అన్న నిర్ణయానికి వచ్చారు. పార్టీలో కొనసాగడం కంటే క్విట్ అవ్వడమే మేలన్న అభిప్రాయానికి వచ్చారు. అధికారంలో ఉండి కూడా ఇలా తన వాళ్లను హత్యచేస్తుంటే చూస్తూ ఎలా ఊరుకుంటానని ఆయన ప్రశ్నిస్తున్నారు. గతంలో సంజీవ్ కుమార్ ను బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లో చేర్చుకున్నప్పుడు కూడా మంత్రులు వెళ్లి కొంత శాంతింప చేశారు. ఈసారి అలా కాకుండా ముందు రాజీనామా చేసేసి ఆ తర్వాత భవిష్యత్ నిర్ణయాన్ని ప్రకటించాలని జీవన్ రెడ్డి భావిస్తున్నట్లు తెలిసింది.

# డిస్కంల ప్రతిపాదనలు తిరస్కరించండి

**- కరెంటు చార్జీల భారం వేయొద్దు**

**- టీజీఈఆర్సీ బహిరంగ విచారణలో పలువురి అభ్యంతరాలు**

**- చార్జీలు పెంచట్లేదు : సీఎమ్డీ**



హైదరాబాద్: కరెంటు చార్జీల పెంపు కోరుతూ డిస్కంలు చేసిన ప్రతిపాదనల్ని నిర్ద్వంధంగా తిరస్కరించాలని పలురంగాల పిటీషన్దారులు టీజీఈఆర్సీకి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (టీజీఈఆర్సీ) చైర్మెన్ తన్నీరు శ్రీరంగారావు, సభ్యులు ఎమ్డీ మనోహరరాజు, బండారు కృష్ణయ్య అధ్యక్షతన బుధవారంనాడిక్కడి విద్యుత్ నియంత్రణ్ భవన్లో తెలంగాణ రాష్ట్ర ఉత్తర, దక్షిణ ప్రాంతాల విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కంలు) ప్రతిపాదించిన 2024-25 వార్షిక ఆదాయ అవసరాల ప్రతిపాదనలు (ఏఆర్ఆర్), 2025 నుంచి 2029 వరకు ఐదవ నియంత్రణ కాలానికి సంబంధించిన వ్యాపార, ఆదాయ అవశ్యకత, వీలింగ్ చార్జీలు, క్రాస్ సబ్సిడీ సర్చార్జీలపై బహిరంగ విచారణ జరిగింది. ఈ ప్రతిపాదనల్ని తిరస్కరించాలని పిటీషన్దారులు ముక్తకంఠంతో కమిషన్కు నివేదించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎస్ మధుసూదనాచారి మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ దూరదృష్టి వల్ల విద్యుత్రంగంలో తెలంగాణ స్వర్ణయుగం అయ్యిందన్నారు. వ్యవస్థాపక సామర్థ్యం 7 వేల మెగావాట్ల నుంచి 24 వేల మెగావాట్ల వరకు చేరిందనీ, లాభాలు గడించే సంస్థలా దీన్ని చూడొద్దని చెప్పారు. విద్యుత్ చార్జీలు పెంచొద్దనీ, ప్రభుత్వమే సబ్సిడీలు ప్రకటించి, ఆ భారం భరించాలని కోరారు. దీనిపై విద్యుత్రంగ నిపుణులు, సెంటర్ ఫర్ పవర్ స్టడీస్ కన్వీనర్ ఎమ్ వేణుగోపాలరావు మాట్లాడుతూ ప్రభుత్వమే అన్నింటికీ సబ్సిడీలు ఇస్తే, ఈఆర్సీ, ఏఆర్ఆర్లు, బహిరంగ విచారణలు ఏవీ అవసరం లేదని అన్నారు. ఏ విధానాలతో విద్యుత్ సంస్థలు నిర్వీర్యం అవుతున్నాయో వాటిని సమీక్షించాలే తప్ప, అన్నింటినీ ప్రభుత్వమే భరించాలి అనడం సరికాదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజలపై ఒకసారి రూ.5,600 కోట్లు, మరోసారి దాదాపు రూ.7,800 కోట్ల విద్యుత్ భారాలు మోపారని గుర్తుచేశారు. వచ్చే ఐదేండ్లలో 20వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ కోసం ప్రణాళికలు సిద్ధం చేశామని విద్యుత్శాఖ మంత్రి ప్రకటించారనీ, ఇప్పటికే మిగులు విద్యుత్ను ఏం చేసుకోవాలో అర్థంకాక డిస్కంలు తలలు పట్టుకుంటుంటే, మళ్లీ అదనంగా వచ్చే విద్యుత్ను ఏం చేసుకుంటారని ప్రశ్నించారు. ఓవైపు మిగులు విద్యుత్ అంటూనే ప్రభుత్వరంగంలోని జెన్కో యూనిట్లను బ్యాకింగ్డౌన్ చేస్తున్నారన్నారు. ఈఆర్సీ కూడా వెనుకాముందు ఆలోచించకుండా విద్యుత్ కొనుగోలు ఒప్పందాలకు (పీపీఏ) అనుమతులు ఇచ్చేసిందని ఆక్షేపించారు. అధిక ధరలకు బహిరంగ మార్కెట్ నుంచి మనం కరెంటును కొని, మన మిగులు విద్యుత్ను అతితక్కువ ధరకు అమ్ముతున్నామని గుర్తుచేశారు. మిగులు విద్యుత్ను నియంత్రించకుంటే ఆ భారం తిరిగి వినియోగదారులపైనే పడుతుందని చెప్పారు. ఈ విషయంలో డిస్కంలు పారదర్శకంగా వ్యవహరించట్లేదని విమర్శించారు. ఫిక్స్డ్ చార్జీలను ఆ స్థాయిలో పెంచాల్సిన అవసరం లేదని సూచించారు. కేవలం రూ.1,221 కోట్ల ఆదాయం కోసం టారిఫ్ ప్రతిపాదనలు చేశారనీ, ఈ సొమ్ము వస్తే డిస్కంల కష్టాలు తీరతాయా అని ప్రశ్నించారు. ప్రభుత్వం నుంచి రావల్సిన బకాయిలు రాబట్టుకోవాలనీ, అంతర్గత సామర్థ్యం పెంచుకోవాలని సూచించారు. డిస్కంల ప్రతిపాదనల్ని తిరస్కరించాలని కోరారు. భారత్ కిసాన్ మోర్చాకు చెందిన పలువురు కార్యకర్తలు డిస్కంల ప్రతిపాదనలపై అభ్యంతరాలు వ్యక్తం చేశారు. పలు స్థానిక సమస్యల్ని ప్రస్తావించారు. సంస్థలో జరుగుతున్న అవినీతిని ప్రశ్నించారు. విద్యుద్ఘాతాలతో సంభవించిన వ్యక్తుల మరణాలు, పశు మరణాలు, పరిహారాల చెల్లింపు, పనుల్లో జాప్యత వంటి అంశాలపై అధికారుల్ని వివరణ అడిగారు.

# ఈఎస్ఐ మందులు ప్రయివేటుకు మళ్లింపు

**- ప్రభుత్వ ఫార్మాసిస్టుపై కేసు నమోదు**

**- రూ.4.87లక్షల మందులు సీజ్**



హైదరాబాద్: ఈఎస్ఐలో నిఘా, పారదర్శకత లోపించడంతో ఉచిత మందులను దారి మళ్లిస్తున్నారు. డ్రగ్ కంట్రోల్ అధికారులు విశ్వసనీయ సమాచారం మేరకు కరీంనగర్లో చేసిన దాడిలో కార్మికుల ఆరోగ్యం కోసం ఉచితంగా ఇవ్వాల్సిన మందులను ప్రయివేటు మెడికల్ స్టోర్స్లో నిల్వ చేసినట్టు గుర్తించారు.కరీంనగర్ జిల్లా ఒస్మాన్ పుర, డోర్ నెంబర్ 4-1-67లో ఉన్న శ్రీ శ్రీనివాస మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్లో ఈఎస్ఐ సప్లై నాట్ ఫర్ సేల్ అనే లేబుల్ కలిగిన రూ.4.87 లక్షల విలువైన ఐదు రకాల ఔషధాలను గుర్తించారు. వీటిలో యాంటీ బయాటిక్స్తో పాటు తదితర మందులున్నాయి. దీంతో విచారణ చేపట్టగా కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ కాగజ్నగర్, ఎస్పీఎం కాలనీ ఈఎస్ఐ డిస్పెన్సరీలో ఫార్మాసిస్టు గ్రేడ్-2 దునబోయిన మురళీ రావు చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడుతున్నట్టు గుర్తించారు. ఆయన కరీంనగర్లోని శ్రీనివాస మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్ మేనే జింగ్ పాట్నర్ గంప కృష్ణకు చట్టవిరుద్ధంగా ఈ మందులు మళ్లిస్తున్నట్టు డ్రగ్ కంట్రోల్ అధికారులు తెలిపారు. సికింద్రాబాద్లో కాలం చెల్లిన మందులు సికింద్రాబాద్, వారాసీగూడ, నామాలగుండులోని భార్గవి మెడికల్ స్టోర్స్లో కాలం చెల్లిన మందులను నిల్వ ఉంచినట్టు డ్రగ్ కంట్రోల్ అధికారులు గుర్తించారు. విశ్వసనీయ సమాచారం మేరకు చేసిన ఈ దాడుల్లో రూ.60 వేల విలువైన 54 రకాల ఔషధాలను స్వాధీనం చేసుకున్నారు.ఈ నెల 15నుంచి 22 వరకు చేసిన దాడుల్లో రూ.9.15లక్షల విలువైన నిల్వలను స్వాధీనం చేసుకున్నట్టు డ్రగ్ కంట్రోల్ అథారిటీ డైరెక్టర్ జనరల్ వీ.బీ.కమలాసన్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

# విద్యావ్యవస్థలో సంస్కరణలు తేవాలి


**- పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి**

**: ఉన్నత విద్యామండలి చైర్మెన్కు మంద కృష్ణ మాదిగ విజ్ఞప్తి**



హైదరాబాద్: రాష్ట్రంలో ఉన్నత విద్యావ్యవస్థలో సంస్కరణలు తేవాలనీ, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని ఎంఆర్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఉన్నత విద్యామండలి చైర్మెన్ వి బాలకిష్టారెడ్డి, వైస్చైర్మెన్ ఇటిక్యాల పురుషోత్తంను హైదరాబాద్లో ఆయన కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారికి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించారు. గత పదేండ్ల కాలంలో ఉన్నత విద్యావ్యవస్థ పేద, అణగారిన విద్యార్థులకు దూరమైందని మంద కృష్ణ మాదిగ తెలిపారు. విశ్వవిద్యాలయాల్లో నెలకొన్న సమస్యలు, అరకొర వసతుల మధ్య విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సామాజిక స్పృహ, ఉత్తమమైన పరిపాలన అనుభవం కలిగిన బాలకిష్టారెడ్డి, పురుషోత్తం ఉన్నత విద్యామండలికి చైర్మెన్, వైస్ చైర్మెన్గా నియమితులు కావడం అభినందనీయమని తెలిపారు. ప్రత్యేకంగా చొరవ తీసుకుని విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేసి నూతన సంస్కరణలను తేవాలని సూచించారు. పేద, అణగారిన వర్గాల విద్యార్థులకు ఉన్నత విద్యను అందుబాటులోకి తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్ మాదిగ, నాయకులు టీవీ నరసింహ మాదిగ, తిప్పారపు లక్ష్మణ్ మాదిగ, అనిల్, కోటి తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ అధికారులకు సిబ్బందికి ఎస్సే రైటింగ్ టెస్ట్..!



సిద్దిపేట: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు పురస్కరించుకొని పోలీస్ కమిషనర్ ఆదేశానుసారం ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్, ఆధ్వర్యంలో సిద్దిపేట డివిజన్, గజ్వేల్ డివిజన్, హుస్నాబాద్ డివిజన్, డివిజన్ల వారీగా పోలీస్ అధికారులకు సిబ్బందికి ఎస్సే రైటింగ్ కాంపిటేషన్ టెస్ట్ నిర్వహించడం జరిగింది. కానిస్టేబుల్ నుండి వరకు సమాజంలో పోలీసు ప్రతిష్టను మెరుగుపరచడంలో పోలీసుల పాత్ర అనే అంశంపై ఎస్సే రైటింగ్ నిర్వహించడం జరిగింది.ఎస్ఐ నుండి పై స్థాయి అధికారి వరకు దృఢమైన శరీరంలో దృఢమైన మనస్సు అనే అంశంపై ఎస్సే రైటింగ్ నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ. పోలీస్ అధికారులకు సిబ్బందికి ఎస్సే రైటింగ్ టెస్ట్ నిర్వహించడం జరిగిందని తెలిపారు కానిస్టేబుల్ నుండి ఏఎస్ఐ వరకు ముగ్గురిని సెలెక్ట్ చేసి, ఎస్ఐ నుండి పై స్థాయి అధికారి వరకు ముగ్గురిని సెలెక్ట్ చేసి ఆరుగురు పేర్లు రాష్ట్ర స్థాయికి పంపించడం జరుగుతుందని తెలిపారు. పోలీస్ అమరవీరుల సంస్మరణం వారోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. రాష్ట్రస్థాయిలో సెలెక్ట్ అయిన పోలీస్ అధికారులకు సిబ్బందికి అప్రిసియేషన్ సర్టిఫికెట్, నగదు రివార్డు అందజేయడం జరుగుతుందన్నారు.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**